# HANNA KRUPA®

**Christian Devotional Monthly Magazine**

**సంపుటి : 11** **సంచిక : 6**

ప్రభువగు యెహోవాయే నాకు బలము

THE NATIONAL CHURCH OF INDIA 1958

## విషయసూచిక


| | | |
|---|---|---|
| జీవనమంతయు... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| విలియంకేరి... | ఆంద్రూస్ దావల, గుంటూరు | 4 |
| ప్రవక్తయైన యోవేలు | కొడవటికంటి | 6 |
| ప్రయాణంలో ఓ మజిలీ | కొడవటికంటి | 7 |
| సువార్తికుడిగా జాన్‌దేవిడ్ | అరుణ్‌కుమార్ కె. మహంతి, సి. హెచ్. పేట | 8 |
| బీదలను కటాక్షించువాడు... | శ్రీ బి.ఇశ్రాయేలు, వారి సహచరులు | 10 |
| సాక్ష్యము | అబ్రహాం సామ్యేల్ శర్మ, నిడుబ్రోలు | 12 |
| డిసెంబర్ నెల ప్రశ్నలు | శ్రీ పంతగాని గ్రేషియస్ , ఏలూరు | 15 |
| విశ్వాసంలో ... | కొడవటికంటి | 16 |
| క్రీ॥శే॥వై.యస్.చిన్నకొండారెడ్డి | శ్రీ.వై.యస్.ప్రకాశ్ రెడ్డి , పులివెందుల | 20 |
| హవీలా ప్రియదర్శిని | కొడవటికంటి | 22 |
| ఆలేషా - కుంద | లియో టాల్‌స్టాయ్ | 24 |
| ఉత్తరాలు | శ్రీమతి కనికరమ్మ & యం.ఆశీర్వాదం | 26 |
| నా జీవితంలో ప్రభువు హస్తం | శ్రీమతి మేరి కమల , బెంగుళూరు | 27 |
| యేసుకథ | కొడవటికంటి | 29 |
| న్యూస్ | హన్నాకృప డెస్క్ | 31 |



**కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**
చీఫ్ ఎడిటర్, హన్నాకృప
పోస్ట్‌బాక్స్ - 51, డోర్ నెం.54-1-23(ఎ)
కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు-523 001
9866716506


**సంవత్సర కానుక : రూ. 200/**

| | | |
|---|---|---|
| ఆన్‌లైన్ అకౌంట్ నెం. | : | **10957294362** |
| బ్రాంచి నెం. | : | 0890 స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా |
| అకౌంట్ హోల్డర్ | : | కె. సామ్యేల్ రాజేంద్ర, కృపాదానంవీధి, క్లాపేట, ఒంగోలు |
| సెల్ | : | 9866 716 506 |


Editor :
**Rev. Nathaniel R.Kodavatikanti** B.Th.,M.A.,M.Phil
Gen Secretary,UCLI.Ongole

Hon. Editor :
**Rev. K. Vijaya Chandra**
Hannahkrupa Memorial Church, Bangalore

Hon. Advisor :
**Sri. Yadavalli Prasada Rao**
Pay & Accounts Officer, Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushotham Reddy**
Spdt, Sri Rajareddy Hospital
Pulivendula

**Sri. M.Shalem Vikranth Vardhan**
Director, Good News Messengers, Guntur

**Dr. Pikkili Hussenaiah**
Sri Parvathi Nursing Home, Besthavaripeta

**Smt. Mahasamudram (Katta) Nageswari Bhaskar, M.Sc., H.Sc.,Hyd.**

**Smt. K. Victoria Rukmini, B.A.,B.Sc.,B.Ed.**
Rtd. H.M., Markapuram

**Dr. Z.C. Devadanam,** Former Treasurer
National Council of Churches in India,
Nagpur, Resident at Karnool

# జీవనమంతయు...



మీరు మీ తండ్రిని అడుగకమునుపే మీకు అక్కరగా ఉన్నవేవో ఆయనకు తెలియును. కాబట్టి మీరీలాగు ప్రార్థన చేయుడి – (పరలోమందున్న మాతండ్రి....) అని యేసుప్రభువు తనపై ఆధారపడి జీవనము సాగిస్తున్న యవ్వనసులైన తన శిష్యులతో చెబుతున్నాడు. (యేసు శిష్యులందరు ఆయన వయస్సున్నవారే! కొందరు చాలా చిన్నవారు! వాళ్ళు వింటున్నారు.)

ఈ సృష్టికర్తయైన దేవుడు నా తండ్రి – మన తండ్రి అని చెప్పినది ఆయన కుమారుడైన యేసేకదా! అయితే ఈ లోకములో ఏ తండ్రి అయినా తన కుమారునితో దుష్టుని ఎదిరించక నిన్ను కుడిచెంపమీద కొట్టువాని వైపునకు ఎడమ చెంప కూడా త్రిప్పుము అని ఎవరైనా చెప్పారా? తన కుమారుని ఎవరైనా కొడితే ఆ కుమారుని కంటే ముందు అతని తండ్రి వెళ్ళి కొట్టినవారిని నాలుగు కొట్టివస్తాడు.

మా ఋణస్తులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము అని తండ్రియైన యేసయ్య మనకు చెబుతున్నాడు.

ఎందుకు? దుష్టుని శిక్షించే శక్తి ఆయనకు లేదా? దుష్టుని వెంటనే శిక్షించేశక్తి ఆయనకు లేదా? లేక రౌడీలైన తమ కుమారులను చూచి ఈ లోకములో కొందరు తల్లిదండ్రులు సంతోషించుచున్నట్లు ఆయన దుష్టులనే ప్రేమిస్తున్నాడా?

దేవుడు మానవుని తన చేతితో నిర్మించాడు. సృష్టినంతా తన నోటిమాటతో – కలుగునుగాక! అని చెప్పగానే అలాగే కలిగింది. నరుని మాత్రము – తాను అంతకు ముందుగానే నిర్మించిన నేలమంటితో నరుని తన చేతితో రూపకల్పన చేసాడు. అంటే నరుని శరీరంలోని అన్ని భాగాలను ఆయన చేతివ్రేళ్ళు తాకాయి. ఆయన నరుని నిర్మించడానికి మంటిని పట్టుకొనినప్పుడే అది జీవము కలిగినదై యున్నది.

ఆయన మనిషి మెదడును, అందలి అణువులను కూడా నిర్మించాడు. మానవ శరీరం యావత్తు మెదడు వలన నడిపించబడుతుంది. ఈ మెదడు ఎంత నిమ్మళంగా ఆలోచిస్తుందో శరీరం మొత్తం గుండె, కిడ్నీ... మన శరీరం ఆరోగ్యం కొరకు శరీరంలో తయారుచేయబడే లాలాజలము తో సహా అన్నిజలాలు మెదడు ఆజ్ఞలప్రకారం ప్రవిస్తున్నాయి.

మనం ఆరోగ్యంగా ఉండాలంటే దుష్టుని కొంచెం సేపు ఓర్చుకో... అప్పుడు నీ మెదడు సరిగా పనిచేస్తుంది. అది దేవుని మీద నమ్మకముతో... విశ్వాసముతో చెయ్యి అన్నాడు.

అలానే అదే సిద్ధాంతమును ఈ లోకములో మన అవసరాలను తీర్చే డబ్బు లేక సిరి విషయంలో కూడా చెబుతున్నాడు. నీదగ్గర ఉన్నది అంతా ఇతరులకు (బీదలకు) ఇవ్వు – నీకు కావలసినది సంతృప్తికరంగా నేను నీకిస్తాను అన్నాడు.

ఏ తండ్రి కూడ తన బిడ్డలతో నీ కష్టార్జితములో కొంత బీదలకు ఇచ్చి నా దగ్గరకు రా! అనడు. ఇంకావీలుంటే వాళ్ళది కూడా లాక్కునిరా! అంటాడు. అయితే ఈ పరలోకపు తండ్రి మనకోసం తన కుమారినినే ఈ లోకానికి పంపివాడు నీకు కలిగినది అమ్మి బీదలకిమ్ము అంటున్నాడు. నా మందిరమున ఆహారముండునట్లు **పదియవభాగము అంతయు** మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకొనిరండి అన్నాడు. ఎందుకు? ఆయనకు చేతకాకనా?

ఆయన ఈ భూమిని కొన్ని చట్టాలప్రకారం నిర్మించి నడిపిస్తున్నాడు. ఆ చట్టము నీకోసం నాకోసం మార్చుకోడు.

దశమభాగము అంతయు ఆయన మందిరపు నిధిలోనికి తీసుకొనివస్తేనే కాని ఆయన ఆకాశపు వాకిండ్లు విప్పి పట్టజాలనంత విస్తారముగా దీవెనలు క్రుమ్మరిస్తాను అన్నాడు. ఇది చట్టము – దీనిప్రకారము చెయ్యకుండా నువ్వు ఎన్నిచేసినా నీ డబ్బు నీకు సరిపోదు. ఒకవేళ చేతిలో, బ్యాంక్‌లో డబ్బు ఉన్నా అది నీకు పనికిరాదు, నీ పని గడవదు. నిన్న – ఈ రోజు – రేపు ప్రతి నిమిషము టి.వి.లో చూసేది, వినేది ఏమిటి? పెత్తనమున్నవాడు దేవుని

**తరువాయి భాగం 14వ పేజీలో**

# విలియం కేరి - మహనీయ జీవితం  8

రచన - ఆంద్రూస్

రెవ. రైలండ్, రెవ. సర్కిల్ అను బోధకులిచ్చిన ప్రార్థన పిలుపునందుకుని ప్రజలు విపరీతంగా స్పందించారు. మాసంలో ప్రతి మొదటి సోమవారం సువార్త సేవ దినంగా పాటిస్తూ మూకుమ్మడిగా ప్రార్థనలు చేసే భక్తులు అధిక సంఖ్యలో ముందుకొచ్చారు. ఏ విజయానికైనా ప్రార్థన ఆలంబనమైతే సువార్తసేవకు కూడా ప్రార్థనాబలమే ఇంధనమని, ఆ ప్రార్థన విలువల్ని ఆమూలాగ్రంగా తెలుసుకున్నవాడు విలియంకేరి.

1792వ సంవత్సరం మే నెల 31వ తేదీన నాటింగ్‌లో జరిగిన నార్తాంప్షైర్ రివైవల్ బైబిలు సభలలో ప్రసంగించేందుకు విలియంకేరిని ఆహ్వానించారు. ఆ సందర్భంగా విలియంకేరి ఉద్ఘాటించిన ప్రసంగ పాఠం అద్భుతం! మెమొరియల్ సెర్మన్స్‌గా చరిత్ర సృష్టించింది. అందుకాయన ఎంచుకున్న అంశం యెషయా 54 :2,3. ఆ వాక్యమంతటిని రెండు వరుసలకు కుదించి దానినొక నినాదంగా ఆ సభల్లో పాల్గొన్న ప్రజలకందించాడు. అది...

**దేవుని నుండి గొప్ప కార్యాల కోసం నిరీక్షించు**
**దేవుని కోసం అరుదైన కార్యాలు సాధించు.**

ఆ నినాదం విశ్లేషంగా విలియంకేరి ప్రకటించిన ప్రసంగం ప్రేక్షకుల హృదయాల్ని తెరచి దైవావేశ జ్వాలలతో నింపిన మహత్తర సందేశంగా కొనియాడబడింది. విన్నవారంతా బరువెక్కిన గుండెల్తో భారంగా, మౌనంగా ఇండ్లకు వెళ్ళారు. అలా ప్రేక్షకులు స్పందనా రాహిత్యంగా నిష్క్రమించడం విలియంకేరిని నిరాశపరిచింది. తన ప్రసంగమంతా నిష్ఫలమనిపించింది. తనను తానే చిన్న బుచ్చుకున్నాడు. ఆయనను సమీపించిన ఆంద్రూ ఫుల్లర్ రెండు చేతుల్ని కేరి ఆవేశంగా పట్టుకొని, గద్గద స్వరంతో

" మీరు కూడా అంతేనా...? మాటా, పలుకు లేకుండా ఇంటికెళ్ళి పోవాలనుకున్నారా?ఈ దినం కూడా మనం క్రీస్తు కోసం ఏమీ సాధించలేమా? ఏ నిర్ణయమూ తీసుకోలేమా? మరొక దినం కూడా మన నిష్క్రమణలతో వృధా కావలసిందేనా?" అంటూ కన్నీరు, మున్నీరుగా ప్రలాపించాడు. విన్నవారు, చూసినవారు నిరత్తరులయ్యే ప్రలాపన అది! పాషాణాలు కూడా స్పందించి నీరయ్యే విలాపమది. ఫుల్లర్ కూడా వింటూ అవాక్కయ్యాడు. కాని, ఆ సమయంలోనే కరుణరథం కదిలి పయనానికి సిద్ధమయింది. ఫుల్లర్ కళ్ళు చెమ్మగిల్లాయి. సువార్త ప్రకటనకు తనవంతుగా ఏమైనా చెయ్యాలనే తపన అందరిలో చెలరేగింది.

"సువార్తను ప్రకటించకుంటే నాకు శ్రమ" అనే కేరి పాలికేక - కొండలు, కోనల్ని దాటివచ్చి ఫుల్లర్ చెవి సోకింది. నా జీవితాన్నే విదేశాలలో సువార్త ప్రకటనకు అంకితం చేస్తానని ఉన్నపళంగా ప్రతిజ్ఞ చేశాడు. సువార్త ప్రకటనోద్యమ విషయంలో ఇంకా నీళ్ళు నములుతూ ఆలస్యం చేయడం అక్రైస్తవచర్యగా అభివర్ణించాడు. ఆ విధంగా ఆనాటి సంఘటన, ఆ చరిత్రాత్మక ప్రసంగం, మిషనెరి సమాజ నిర్మాణానికి, అందులోని సభ్యుల్ని పరిచర్యకు ఆయత్తపరచి విదేశాలకు పంపడానికి ప్రేరకాలయ్యాయి.

ఆ విధంగా నార్తాంప్షైర్‌లో విలియంకేరితో ఒప్పంద పడిన నిర్ణయ ఫలితాలు మరో నాలుగు నెలల్లో పరిపక్వ దశకు చేరుకున్నాయి. 1792 అక్టోబరు 2వ దినాన కేట్రిన్ పట్టణంలో వాలిస్ అనే వితంతువు కుటీరంలో చరిత్రాత్మక బాప్టిస్ట్ మిషనరి సొసైటి స్థాపించబడింది.

**మిషనరి సొసైటి :-**

18వ శతాబ్ధంలో ఇంగ్లాండ్ దేశపు నలువైపులా సొసైటీల పంటకు బీజాలు విత్తారు. మత, సాంఘిక, సాహిత్య, ఆర్థిక, శాస్త్రీయ సంబంధమైన అనేక సొసైటీలు స్థాపించబడ్డాయి. వాటిలో కొన్ని పురిటిలోనే సందికి గురైనా విలియంకేరి స్ఫూర్తితో వెలుగు చూపిన బాప్టిస్ట్ మిషనెరి సొసైటి నేటికి విజయవంతంగా నిర్వహింపబడుతూ ఉంది.

ఆనాడు ఈ సొసైటీకి వేదికైన గృహం, ఈనాడు గాస్పెల్ హౌస్‌గా బాప్టిస్ట్ క్రైస్తవులకు ప్రసిద్ధ కేంద్రమైంది. మిషనెరి సొసైటి స్థాపించే విషయంలో అర్ధమనస్కంగా ప్రవర్తించిన వారిని కర్తవ్యం వైపు పురికొల్పి అహర్నిశలూ వారికి భోజనం, వసతి సౌకర్యాలు కల్పించడమే కాకుండా తనకున్న ఒక్క గృహాన్ని కూడా మిషనెరి సొసైటికి దానం చేసిందా విధవరాలు వాలిస్. ఆ గాస్పెల్ హౌస్ మూలంగా కేథరిన్ పట్టణమే ఇంగ్లాండ్ దేశంలో యాత్రాస్థలంగా పేరు గాంచింది. నాలుగు మాసాల క్రితం నాటింగ్‌హోమ్ పట్టణం లో, ఉజ్జీవ సభనుద్దేశించి విలియంకేరి చేసిన ప్రసంగం వృధాకాలేదు. ఒక దినం నలభై వంవత్సరాలలోపు వయసు గల పద్నాలుగుమంది విశ్వాసుల బృందం, వాలిస్ గృహంలో సమావేశమై క్రీస్తునెరుగని విదేశీయుల మధ్య సువార్త పరిచర్య చేపట్టేందుకు మిషనెరీలను ఎంపిక చేయాలని సరికొత్త నిర్ణయం ప్రతిపాదించి ఆ దిశగా ఒక సబ్ కమిటీకి రూపకల్పన చేశారు.

ఈ సొసైటీకి ఆర్థిక సహాయం అందించే పన్నెండు మంది దాతలతో ఒక జాబితాను తయారుచేశారు. "ఎంక్వయిరి" గ్రంధం అమ్మకాలతో సేకరించిన మొత్తాన్ని ప్రథమ విరాళంగా విలియంకేరి సొసైటీకి అందజేశాడు. ఎంతో కాలంగా అపురూప కలిమిగా దాచుకున్న నస్యం డబ్బాను ఆంద్రూపుల్లర్ తన కానుకగా ప్రకటించాడు. సిడ్నీస్మిత్ అనే పెద్దమనిషి, ఆ డబ్బాను చూసి ఎగతాళి చేస్తూ ఘొల్లుమని నవ్వాడు. ఆయనకు దాని విలువ తెలియదు. ఆ మాటకొస్తే, అక్కడున్న వారికెవరికీ అదొక అపురూప కళాఖండమని తెలియదు. ఈనాడు కేథరిన్ నగరంలోని గాస్పెల్ హౌస్ సందర్శించినవారు ఆ నస్యం డబ్బా చూడకుండా బయటకు రాలేరు. తార్సు పట్టణవాసి అపోస్టలుడైన పౌలు రూపం ఆ డబ్బాపైన చిత్రించడమే ఆ కళాఖండం ప్రాశస్త్య రహస్యం. అలా నస్యం డబ్బా వేలంతో ఆరంభమైన ఆర్థిక సహాయం, ఆగిపోకుండా, ఎండిపోకుండా జీవజలంలా నిరంతరం ఊరుతూ ఆ సొసైటీకి ఊపిరిపోస్తూ, కోట్లాదిమందికి క్రీస్తును పరిచయం చేసేందుకు ఆదరు వయింది.

ఆ సొసైటీకి ప్రథమ సెక్రటరీగా ఆంద్రూ పుల్లర్ ఎన్నికయ్యాడు. అది మొదలుకొని, ఆమరణాంతరం ఆయనే సొసైటీకి వ్యవస్థాపక సెక్రటరీగా పనిచేస్తూ ఎందరికో ఆదర్శనీయుడయ్యాడు. ఆయనతోపాటు, రోనాల్డ్‌హక్, కోశాధికారిగా విలియంకేరి, జాన్ సర్విన్, రేలండ్ మరో 124మంది సాధారణ సభ్యులుగ సొసైటీకి ఒక ఆకారం కల్పించి నిండుదనమిచ్చారు. ఒక అనామక కేథరిన్ పట్టణం మిషనెరీ సొసైటికి జన్మనిచ్చి తన స్థాయిని పెంచుకుని ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. ఆదిలో మోల్టన్‌పట్టణంలో మిషనెరి సొసైటీని స్థాపించాలనుకున్నారు. అది వీలుకాలేదు. అక్కడున్న బాప్టిస్ట్ సంఘానికి ఆర్థిక సహాయంగా ఉండేందుకే ఓ గ్రంధం వ్రాయబడింది. ఆ గ్రంధం ముద్రణ లీసెస్టర్ పట్టణంలో జరిగింది. అలా విలియంకేరి విజయానికి సంకేతాలైన ఆ పట్టణాలు చారిత్రాత్మకమయ్యాయి. ఈ ధరణి ఉన్నంతకాలం క్రైస్తవుల మేధస్సుల్లోంచి ఆ జ్ఞాపకాలు చెరిగిపోవు.

కేథరిన్ పట్టణాన్ని మిషనెరి రాజధానిగా చేసుకుని మిషనెరి కదలికలను నియంత్రించే కార్యాలయం నిత్యం భక్తులతో కోలాహలంగా ఉండేది. సొసైటి గురించి విస్తృతంగా ప్రచారం సాగించడం మూలంగా, ఇంగ్లాండ్ దేశ నలుమూలల నుండి విరాళాలు రాసాగాయి. శామ్యూల్ అనే బర్మింగ్‌హోమ్ వాసి 70 పౌండ్ల విరాళం పంపంచడం ప్రథమ సంచలనం. ఆ తరువాత స్కాట్లాండ్, యార్క్‌షైర్, బ్రిస్టల్, లండన్ నగరాల నుండి త్యాగధనులు విరాళాలు పంపి చిరుప్రాయంలో ఉన్న సొసైటిని ఆదుకున్నారు. సొసైటి స్థాపించడం నిరాటంకంగా జరిగింది గాని, దాని ధ్యేయానికి ఆచరణయోగం కల్పించేందుకు అంకితభావమున్న మిషనెరీలు దొరకడం అసాధ్యమైంది. మిషనెరీలను పంప వలసిన దేశాలను, ప్రదేశాలను నిర్ధారించేదెవరు? ఈ వ్యవస్థ వ్యాపకాలకు చలనం కల్పించే కథానాయకుడు, మిషనెరీ సొసైటికి అదృశ్య అధ్యక్షుడైన క్రీస్తే – తన దాసులను ఎంపిక చేసుకుంటాడని సరిపెట్టుకుని వారిరాక కోసం సభ్యులు నిరీక్షిస్తూ కూర్చున్నారు.

# ప్రవక్తయైన యోవేలు - 2

పెతూయేలు కుమారుడైన యోవేలు - చిన్న ప్రవక్తలలో రెండవవాడు. రూబేను గోత్రికుడై బెతోరన్ పట్టణవాసి. బెతోరన్ అనే పట్టణం యోర్దానుకు పడమర తట్టు ఎఫ్రాయాముల వైపున ఉన్నది. అయితే బెతోరన్ పట్టణం యోర్దాను అవతల అంటే యోర్దానుకు తూర్పున రూబేను గోత్రికులలో ఉన్నది.

యోవేలు యూదా రాజ్యములో అంటే దక్షిణ రాజ్యములో ప్రవచించాడు.

ఇతను ఇశ్రాయేలు రాజ్యము (ఉత్తరభాగము) పది గోత్రములు చెరపట్టుకొని పోబడేంతవరకు కనిపించలేదు. అతను ఏ సంవత్సరములలో జీవించాడో, ఎప్పుడు చనిపోయాడో మనకు చెప్పబడలేదు.

అతను యూదా మీదకు రాబోయే గొప్ప మిడుతల దండును గురించి ప్రవచించాడు. ప్రస్తుత వేదాంతులు ఇతను క్రీ.పూ. 444లో జీవించాడు అంటారు.

ఎజ్రాగారు గ్రంధములను, పుస్తకాలను సరియైన స్థితిలో పెట్టేటప్పటికి ఈ గ్రంధము ఉన్నది. అష్షూరు 720లో ఇశ్రాయేలు పది గోత్రాలను చెరగొనిన సంగతి ఈ గ్రంధములో పలుకరించలేదు.

మొదటి శతాబ్ధములోని బైబిల్ వ్యాఖ్యాతలు మిడుతల దండు అంటే విదేశీ సైనికుల గురించి యోవేలు ప్రవచించాడు అంటారు.

వారిలో ముఖ్యుడు జఫత్ - బిన్ ఆలీ కరాయితూ ముఖ్య బైబిలు వ్యాఖ్యాత - నాలుగు రకాల చీడ పురుగులు లేక మిడుతలు - నాలుగు శత్రు రాజ్య సైనికులు అని తేల్చాడు.

కొందరు వ్యాఖ్యాతలు ఉత్తరాది సైన్యముకును దేవునికిని - మాగోగు యుద్ధమునను సూచిస్తున్నారని అది మెస్సయ్య యుద్ధాలుగా వర్ణించారు.

యోవేలు వ్రాత వాఙ్మయములో గొప్పదిగా చెబుతారు. భాషలో మృదుత్వము సరళమైన స్వరముతో వినిపిస్తుంది.

యోవేలు గ్రంధము మూడు అధ్యాయములలోని డెబ్బయి మూడు వచనాలను రెండు భాగాలుగా విభజించారు. 1:1,2-17; 2:18; 3:21 మొదటి భాగము దక్షిణాది వారైన యూదా వారికి భయంకరమైన మిడుతల దండు వస్తుందని చెప్పారు. 1:2-7 భయంకరమైన కరువు ప్రాప్తించిందని చెప్పారు.

దానికి తోడుగా రాబోయే ప్రభువు దినము భయంకరముగా ఉంటుందని, కనుక ప్రజలు పశ్చాత్తాపపడి వారి దుష్క్రియలు మానుకోవాలని ఉపవాసముండి, ఏడ్చి, రోధించమని, మీ వస్త్రాలనుకాదు మీ హృదయములను చించుకొమ్మన్నారు.

రెండవ భాగములో ప్రజలు ప్రవక్త యొక్క ప్రవచనము విని, మారుమనస్సు పొంది, రాబోయే కీడు తప్పించుకోవడానికి ప్రార్ధనచేశారని, అందువలన గొప్ప వర్షము కురిసినందువలన పంటలు పండాయని అన్నారు.

నేను సర్వజనులమీద నా ఆత్మను కుమ్మరించుదును. మీ కుమారులు మీ కుమార్తెలు ప్రవచనములు చెప్పుకొందురు. మీ ముసలివారు కలలు కందురు. మీ యవ్వనస్తులు దర్శనములు చూతురు అని చెప్పి ఆ దినము యెహోవా నామమును బట్టి ప్రార్ధన చేయువారందరు రక్షింపబడుదురు.

అన్యజనులకు ఈ సమాచారము ప్రకటించుడి అని ఎగతాళిగా - మీ కర్రలు చెడగొట్టి ఖడ్గములు చేయుడి. మీ కత్తులు చెడగొట్టి ఈటెలు చేయుడి అన్నాడు.

అయితే యూదా దేశములో నివాసులు నిత్యము ఉందురు. తరతరములకు యెరూషలేము నివాసముగా ఉండును. యెహోవా సీయోనులో నివాసిగా ఉండును.

ఆఖరి రెండు వచనములు యేసుక్రీస్తు యొక్క సన్నిధి ఎల్లప్పుడు ఆయన ప్రజల మధ్య నివశిస్తుంది అని సూచిస్తుంది.

# ప్రయాణంలో ఓ మజిలి

1995 జవహర్లాల్ నెహ్రూ పుస్తకం చదివి ఆసెనతు పుస్తకం కొరకు కావలినుండి ఒంగోలు వచ్చి ముప్పై రూపాయలు ఇచ్చి ఓ ఆసెనతును కొనడంతో బ్రదర్ గుండాబత్తిన స్టాలిన్గారి పరిచయము ప్రారంభమైనది. తర్వాత ఆయన రెండు మూడుసార్లు కావలినుండి వచ్చి పదిపుస్తకాలు ఆసెనతును కొని, ఇతరులకు చదవమని ఇచ్చారు. ఆయన మొదటిసారి పంజాబుకు సేవార్థమై వెళ్తూ ఆసెనతు ఇంగ్లీషులో ఉన్నదా? అని అడిగారు. ఎందుకు? అంటే పంజాబువారికి తెలుగు రాదు కదా! అన్నాడు.

పంజాబ్లో పంజాబు 'రోజీ'ని పెండ్లి చేసుకున్నారు. ఇప్పుడు వీరికి ఇద్దరు పిల్లలు. కావలి వచ్చిన ప్రతిసారి నాకు ఫోన్ చేస్తారు. అలానే నవంబర్ మూడవ తారీఖున ఉదయం ఫోన్ చేశారు – కావలి వచ్చామని. నేను స్టేషన్కి వెళ్ళి జనశతాబ్ది ఎక్స్ప్రెస్ టిక్కెట్టుకొని, ఓ అరుగు మీద కూర్చున్నాను. సాయంకాలం మూడున్నర గంటలు అయింది. బండి నాలుగు పదిహేను నిమిషాలకు అన్నారు. మెట్లు ఎక్కి మూడవ నెంబరు ప్లాట్ఫాంకి వెళ్ళాలా? లేక ఒకటో నెంబరు ప్లాట్ఫాం మీద చాలాదూరం నడిచి పట్టాలమీదుగా మూడవ నెంబరు ప్లాట్ఫాం మీదకు వెళ్ళాలా? అని పదిహేను నిమిషాలు ఆలోచించాను. చివరికి నడిచి వెళ్ళాలని నడక ప్రారంభించాను. రైల్వే పోలీస్స్టేషన్ వద్ద బెంచిమీద ఎవరో యువకుడు కూర్చున్నాడు.

అతని ప్రక్కన కూర్చుని, 'శతాబ్ది ఎక్స్ప్రెస్లో రిజర్వేషన్ నెంబరు ఎంత?' అని టిక్కెట్టు చూడమని నా టిక్కెట్టు ఆయనకు ఇచ్చాను. అప్పుడు చూశాను ఆయన బైబిల్ చదువు కుంటున్నారు. చాలా సంతోషంవేసింది.

'సార్! మీరు క్రైస్తవులా?' అన్నాను.

'కాదండి! ఈ మధ్య ఓ నాలుగు నెలల నుండి బైబిల్ చదువుతున్నాను' అన్నారు.

'ఎలా పరిచయమైంది బైబిల్?' అన్నాను.

'నా భార్య ఈ మధ్య మందిరము వెళ్తుంది. నన్ను కూడ రమ్మంది. నేను కూడ వెళ్తున్నాను. నాకు బైబిల్ అంతగా తెలియదు' అన్నారు. ప్రభువు ఇందుకే నన్ను ఓవర్ బ్రిడ్జి మీదనుండి వెళ్ళకుండా ఇటు తీసుకొని వచ్చాడని అనుకున్నాను. 'మీ పేరు?' అన్నాను. 'గంటా సుబ్బారావు' అన్నాడు. 'మీరు బలిజవారు కదా!' అన్నాను. 'నెల్లూరులో వెంకటేశ్వరపురం దగ్గర కాపురం. నేను ఎ.పి.యస్. అగ్రో ఇండస్ట్రీస్ సంతపేట ఒంగోలులో పనిచేస్తున్నాను' అన్నారు. శతాబ్ది నాలుగు నలభై నిమిషాలకు వచ్చింది. దాదాపు ఓ గంటసేపు యేసు ప్రభువును గురించి, బైబిలు గురించి మాట్లాడుకొన్నాము. నా దగ్గర ఉన్న హన్నాకృప పత్రికను, నేను వ్రాసిన నవల ఒకటి ఇచ్చాను. ఇంతవరకు 20-11-2011 సాయంకాలం వ్రాశాను. నా ఆఖరి కోడలు వాణి అప్పుడే డి.టి.పి. చేసింది.

21-11-11 ఉదయం పది గంటలకు ఆఫీసుకు వచ్చి డిసెంబరు హన్నాకృప ప్రూఫ్ చూస్తున్నాను. ఇంతలో ఫోన్ మ్రోగింది. 'సార్! మీ ఇల్లెక్కడ?' అన్నారు. 'క్లౌపేట ఆరవ లైను' అన్నాను. 'నేను సుబ్బారావుని సార్! అయిదవ లైనులో ఉన్నాను' అని చెప్పి, అయిదు నిమిషాలలో ఆఫీసులోకి వచ్చాడు. 'మా ఆఫీసరు బయటకు వెళ్ళాడు, మిమ్మల్ని చూద్దామని వచ్చాను' అన్నాడు. ప్రయాణంలో ఓ మజిలి ఇచ్చి ఇంకా ఏమైనా కలపాల్సి ఉంటే చెప్పండి అన్నాను.

అప్పుడు సుబ్బారావుగారు – ఈ రోజు పాసింజరులో నేను ఒంగోలు ప్రయాణం చేస్తూ 'ప్రభువా! నాకు నీ వాక్యము అర్థమయ్యేటట్లు తెలియజేయగలవని ఆశిస్తున్నాను, సహాయం చెయ్యి' అని ప్రార్థించాను. నేను ప్రార్థన కూటమునకు ఏ సందేహాలతో, సమస్యలతో వెళ్తానో, వాటికి సంబంధించిన జవాబులు ప్రభువు వాక్యము నాకు తెలియజేస్తుంది. అంతేకాక టి.వి.లో ఏ వాక్యము చూసినా నాకు తగిన విధముగా సమాధానం వస్తుంది. కనుక ప్రభువు నన్ను గమనిస్తున్నాడని, ప్రేమిస్తున్నాడని గ్రహించాను.

పూర్వం పదహారు సార్లు శబరిమలై మాల వేసు కున్నాను. ఈ సంవత్సరం అసలు ఆ తలంపురాలేదు. తిరుపతికి ప్రతి సంవత్సరం వెళ్ళేవాడ్ని. రోజు విగ్రహారాధన చేసేవాడిని. కానీ మా సమస్యలు అలానే ఉన్నాయి. ఇప్పుడు ప్రభువును నమ్ముకొనిన తర్వాత ఆయన నిత్యం నన్ను నడిపిస్తున్నాడు అని సుబ్బారావుగారు చెప్పారు. నేను మరల నా రచనలు నాలుగు ఇచ్చి ప్రార్థన చేసి పంపించాను. స్టాలిన్గారు ఆ ఉదయం ఫోన్ చెయ్యడం, నేను వెంటనే బయలుదేరడం కృష్ణ ఎక్స్ప్రెస్ టిక్కెట్ తీసుకోకుండా శతాబ్ది టిక్కెట్ తీసుకోవడం, ఇలా నడిచి నడచి సుబ్బారావుగారి ప్రక్కన కూర్చోవడం ట్రైన్ ఆలస్యమవడం... అనగా **"ఆయన సంకల్పం చొప్పున పిలువ బడినవారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగు తున్నదని యెరుగుదుము"** అని రోమా 8:28 లో వ్రాయబడిన మాట ఎంత యదార్థము!

# సువార్తికుడిగా జాన్ డేవిడ్

**అరుణ్‌కుమార్ కె. మహంతి, డైరెక్టర్, ఎ.ఎం.జి. ఇండియా ఇంటర్నేషనల్**

అక్టోబర్ 17వ తేదీ అసలు సిసలు సువార్త దినోత్సవం. అది జాన్‌డేవిడ్‌గారి జన్మదినోత్సవం గనుక దేశం నలుమూలల నుండి పలు ప్రాంతాల, వివిధ భాషల మిత్రులంతా చిలకలూరిపేట చేరుకుంటారు. వీరిలో క్రైస్తవులు, క్రైస్తవేతరులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, ఉంటారు. వీరుగాక వివిధ ప్రాంతాలలో ఎ.ఎం.జి. పథకాలు జరిగే స్థలాల నుండి ప్రతినిధులుగా కొందరు వస్తారు. వీరిలో కుష్టువ్యాధిగ్రస్తులు, పోలియో పిల్లలు ఉంటారు. ఇదివరకు ఎ.ఎం.జి.లో చదువుకొని పెద్దలై, ఉద్యోగస్తులై, తల్లిదండ్రులై జీవితంలో స్థిరపడిన వారు కూడా ఉంటారు. వీరంతా తమ ప్రేమాభిమానాలను పుష్పాల రూపంలో వర్షింపజేస్తారు.

ఆ రోజు విచ్చేసిన వారిలో కొందరు ప్రభువును అంగీకరించి అప్పటికప్పుడు క్రీస్తు శిష్యులైనవారుంటారు. ఇది కృతజ్ఞతా దినోత్సవం. ఇంతకాలంగా సువార్త సేవ చేసిన జాన్‌డేవిడ్ గారిని అభినందించే దినం. దేవదేవునికి నిండారా స్తుతులు చెల్లించే దినం. మనసారా ధన్యవాదాలు తెలియజేసే దినం. 365 దినాలలోను ఒక మహోన్నతమైన సువార్తికునికి ఒక ప్రత్యేకమైన రోజును కేటాయించి సన్మానించే సుదినం.

**మతమార్పిడి కాదు – జీవితం మార్పిడి :-**

ఈ క్రింద ఇవ్వబడిన కొన్ని వాక్యాలు చదివితే సువార్త ఎక్కడ, ఎప్పుడు పుట్టిందో తెలుస్తుంది.

1. సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి. మార్కు 16:16
2. అన్ని స్థలాలలో ప్రకటించుడి. రోమా 15:19,20
3. అని సమయాలలో ప్రకటించుడి. రోమా 14:6
4. త్వరితముగా ప్రకటించుడి. 1 కొరింథి 9:16
5. ధైర్యముగా ప్రకటించుడి. ఎఫెసి 6:19
6. సాక్ష్యార్థముగా ప్రకటించుడి. మత్తయి 24:14
7. నిరీక్షణతో ప్రకటించుడి. కొలస్సి 1:23

ఈ వాక్యాలన్నింటిలో ఒక విషయం స్పష్టంగా తెలుస్తుంది. ఒక మనిషి మార్పు – క్రైస్తవ్యం జీవితంలో పరివర్తన తెస్తుంది. "నేనే మార్గమును" అన్న యేసు వాక్యాలను గుర్తుచేసుకుందాం. మనం యేసుప్రభువును విశ్వసించినప్పుడు మనల్ని విశ్వాసులంటారు. మన పేరు క్రైస్తవులు కాదు. ప్రభువు ఆజ్ఞ ఏమిటంటే లోకములోనికి వెళ్ళి అందర్నీ తన శిష్యులుగా చెయ్యమని. మనం ఆయనలో విశ్వాసముంచినప్పుడు మనమాయన పిల్లలమవుతాము. కనుక మనది ఒక కుటుంబం అన్న భావన కలుగుతుంది.

యేసుక్రీస్తు మరణించి లేచిన తొలిరోజుల్లో సంఘ పునాది నిర్మాణం జరుగుతూ ఉండేది. ఆ సమయంలో అవిశ్వాసులు – యేసుక్రీస్తును అంగీకరించిన విశ్వాసులను వెక్కిరిస్తూ క్రైస్తవులు అని పేరు పెట్టి ఉండవచ్చు. క్రైస్తవులు విశ్వాసుల గుంపులో మాత్రం ఒకరినొకరు సహోదరులుగా వ్యవహరించుకునేవారు. దశాబ్ధాలు, శతాబ్ధాలు గడిచే కొలది మతమార్పిడి అనే మాట ప్రాచుర్యంలోకి వచ్చింది. కాని ఇది మొదటి నుండి ఉన్న విషయం కాదు. తరము వెంబడి తరము విశ్వాసుల బృందాలు విడివిడిగా విరివిగా సువార్త ప్రకటిస్తూ విస్తరిస్తున్నప్పుడు "మతమార్పిడి అనే ఈ మాట పలువురి నోట పలికి ఉండొచ్చు. ఈ దినాలలో ఈ మాట చాలామందికి కోపం తెప్పిస్తుంది. వాళ్ళూ వీళ్ళూ వచ్చి ఈ మన మతంలో నుండి మన మనుష్యులను మతమార్పిడి చేస్తున్నారు అని అంటారు. కాని, యేసుప్రభువును విశ్వసించే వారు, ఆ పని స్వచ్ఛందంగా చేస్తారు. కాని ఎందుకో మన వాళ్ళు మతమార్పిడి అనే పదాన్ని తీసుకొని దానికి వెకిలి అర్థాలు సృష్టించి వికృత రూపం తెప్పించారు. ఇది విచారించదగ్గ విషయం. నేటి అలౌకిక భారతదేశంలో ఈ మాట వింటేనే ఒళ్ళు మండేవాళ్ళున్నారు. గనుక మనల్ని విమర్శించే వారికి మనం చెప్పవలసిన సమాధానం ఏమిటంటే "బాబూ మేమెవరినీ క్రైస్తవులుగా మారమని బలవంతం చేయడం లేదు. వచ్చేవారు స్వచ్ఛందంగానే వస్తున్నారు" క్రీస్తులో విశ్వాసం మనిషిలో పరివర్తనకు బాట వేస్తుంది. దుర్మార్గుల్ని సన్మార్గులుగా మారుస్తుంది.

పరివర్తన అంటే ఒక వ్యక్తిని పరిపూర్ణంగా మార్చి వేసే ప్రక్రియ. మతమార్పిడికి, దీనికీ ఏ సంబంధమూ లేదు. పరివర్తన అంటే ఒక మనిషి యొక్క శరీరం, మనస్సు, ఆత్మలో మార్పు కలగడం. ఇది మన హృదయాలను మార్చివేసే ప్రక్రియ. హృదయమే కదా రాగద్వేషాలకు, ప్రేమాభిమానాలకు, ఆవేశకావేషాలకు నిలయం? అలాంటి హృదయం మారితే మనిషిలో పరిపూర్ణ పరివర్తన జరిగిం దన్నమాట. **ఉదా:** ఒక భయంకర నేరస్తుడు యేసుక్రీస్తులో విశ్వాసముంచి తన మనస్సు మార్చుకుంటే అది అందరూ ఆమోదించవలసిన పరివర్తన కాదా! వేశ్య వృత్తిలో ఉన్న ఒక స్త్రీ ప్రభువును స్వీకరించి ఆమె వృత్తిని, ప్రవృత్తిని మార్చుకుంటే ఇది అందరూ ఆనందించవలసిన విషయమే కదా! ఆమెలో పరివర్తన జరిగింది. ఒక త్రాగుబోతు భార్యను హింసిస్తూ బిడ్డల్ని చితకబాదుతూ బ్రతుకుదెరువును నిర్లక్ష్యం చేస్తే, వాడి జీవితంలో యేసుక్రీస్తును బట్టి మార్పు వచ్చి సత్ప్రవర్తనలోకి ప్రవేశించాడనుకోండి. దానిని మతమార్పిడి అందామా! జన్మభూమి చట్టాన్ని ధిక్కరించి పన్ను ఎగవేసి ప్రభుత్వాన్ని మోసం చేసే ప్రబుద్ధుడు, యేసు ప్రభువుని దేవుడిగా అంగీకరించి చట్టానికి లోబడి బ్రతికే పౌరుడిగా మారితే అది మతమార్పిడి క్రిందకు వస్తుందా! దొంగలు, హంతకులు, అబద్ధీకులు, స్వార్ధపరులు, వీరంతా యేసు ప్రభువును దైవముగా స్వీకరించి ఆయనలో విశ్వాసముంచి సమాజానికి వన్నెతెచ్చి మనుష్యులుగా మారిపోతే, దానికి మతమార్పిడి అని పేరుపెడితే ఎంతవరకు సమంజసం? అమాయకత్వం నుండి, తెలియనితనం నుండి, మూర్ఖత్వం నుండి మనుష్యులు క్రీస్తును అంగీకరించి మంచివారుగా మారితే దానిని మతమార్పిడి అని పేరు పెట్టడం భావ్యమా? యేసుక్రీస్తు పాపముల నుండి మానవులను రక్షించడానికి వచ్చాను అన్నాడు గానీ నా మతంలోకి మీరు మార్పు చెందండి అని అడగలేదు. సర్వమానవ కళ్యాణం కోసం సిలువ మీద రక్తం కార్చాడు కాని, మనుష్యుల కోసం మరొక మతం సృష్టించలేదు. రోగులను బాగుచేశాడు. నిస్సహాయు లకు సహాయంచేశాడు. నీవు నిన్ను ఎలా ప్రేమించుకుంటావో నీ చుట్టుప్రక్కల వారిని కూడా అలా ప్రేమించమన్నాడు గాని, ఈ క్రొత్తమతంలో చేరమని ఆయన ఎన్నడూ చెప్పలేదు. తరాలు మారి, యుగాలు మారి, అంతరాలు మారి, అంతరార్ధాలు మారి, ఒక చెడ్డవాడు యేసుక్రీస్తును నమ్మి మంచివాడుగా మారితే వాడు మత మార్పిడి చెందాడు అనే అర్ధరహిత భాష ఒకటి ప్రాచుర్యంలోకి వచ్చింది. యేసుక్రీస్తు బోధలను లోతుగా అధ్యయనం చేసిన ఎవరైనా యేసుక్రీస్తు క్రైస్తవ మతస్థాపకుడు అని చెప్పరు, చెప్పలేరు. అది మతం కాదు మార్గం, సత్యం, జీవం. కాబట్టి పరివర్తన ఎప్పుడూ చెడును మంచిగా మార్చివేస్తుంది. యేసుప్రభువు దుర్మార్గులను సన్మార్గులుగా చేస్తాడు. ఇది స్వాగతించవలసిన విషయం. దీనిని అసహ్యించుకొని అపహాస్యం చెయ్య కూడదు.

మతమార్పిడిని జీవిత పరివర్తన అని చెప్పడం సువార్తికుడైన జాన్‌డేవిడ్‌గారి సువార్తలో ప్రధాన విభాగం. ఆయనను అర్ధం చేసుకున్న లక్షలాదిమంది ప్రజల అభిప్రాయం కూడా ఇదే. ఒక వ్యక్తిలో జరిగిన ఆత్మసంబంధ మైన పరివర్తన అతని భౌతిక ప్రపంచంలో ప్రతిఫలిస్తుంది. మనిషిలో వచ్చే ఈ మార్పు సామాన్య సమాజానికి హర్షదాయకం కావాలి. పరస్పర విద్వేషాల తోనూ సంకుల సమరాలతోను వ్యాకుల చిత్తంతోనూ, ముక్కలు చెక్కలుగా చెదిరిపోయిన మానవ సమాజానికి యేసుక్రీస్తును నమ్మి పరివర్తన చెందిన మనుష్యులు కావాలి. వారు శాంతి దూతలౌతారు. వారి చేతలలో ప్రేమ, క్షమ, దర్శనమిస్తాయి.

ఇదీ సువార్త సారాంశం. సువార్తికులు శాంతి సందేశాలతో యేసుప్రభువుని నమ్మమని, తద్వారా నమ్మిన వారికి సుఖశాంతులు, సమాధానం సంప్రాప్తించడమే కాకుండా వారెక్కడకు వెళ్ళినా ఆత్మ సంబంధమైన, శరీర సంబంధమైన శాంతిని పంచిపెట్టే పనిముట్లుగా ఉంటారు. గనుక సువార్త చరిత్ర – దాని ముందు వెనుకల పుట్టు పుర్వోత్తరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే అది మతమార్పిడి కాదు, జీవితం మార్పిడి అని అవగతమవుతుంది. అందుకే జాన్‌డేవిడ్‌గారు సువార్త పదాన్ని తన జీవన విధానంగా మార్చుకుని దానికి అనుబంధమైన సేవా కార్యక్రమాలను ప్రారంభించి కొనసాగిస్తూ ఉన్నారు. సువార్తికులందరూ ఈ విషయాన్ని గుర్తించి అదే పనిగా పరివర్తనా కార్యక్రమాన్ని విశేషంగా కొనసాగించాలని ఆయన ఆశ... ఆకాంక్ష.

# బీదలను కటాక్షించువాడు ధన్యుడు 4

**శ్రీ బొకినాల ఇశ్రాయేలు - వారి సహచరులు**

**5.** ఏ క్రైస్తవుడు బీదలను (....) కరుణింపకుండ తన హృదయమును కఠిన పరచుకొనకూడదు :

అందుకే, ద్వితియోపదేశకాండము 15:7లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - నీ దేవుడైన యెహోవా నీకిచ్చుచున్న దేశమందు నీ పురములలో ఎవడైనను నీ సహోదరులలో ఒక బీదవాడుండిన యెడల బీదవాడైన నీ సహోదరుని కరుణింపకుండ నీ హృదయమును కఠినపరచుకోకూడదు.

**6.** ప్రతి క్రైస్తవుడు బీదలకు (....) కటాక్షము చూపి వారికి కావలసిన వాటిని నిశ్చయముగా ఇవ్వాలి. అట్లు చేసినందుకు మనస్సులో విచారింపకూడదు :

అందుకే, ద్వితియోపదేశకాండము 15:9లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - బీదవాడైన నీ సహోదరుని యెడల కటాక్షము చూపక నీవు వానికేమియు ఇయ్యకపోయిన యెడల వాడొకవేళ నిన్నుగూర్చి యెహోవాకు మొఱ్ఱపెట్టును... నీవు నిశ్చయముగా వానికియ్యవలెను. వానికిచ్చినందుకు మనస్సులో విచారింపకూడదు. లూకా 3:11లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - రెండు అంగీలు కలవాడు ఏమియు లేనివానికియ్యవలెను.

**7.** ఏ క్రైస్తవుడు బీదవాని (....) వద్ద తాకట్టుగా ఏ వస్తువును తీసుకొనకూడదు. ఒకవేళ తీసుకున్నచో దానిని వాపసు ఇచ్చివేయాలి :

అందుకే, ద్వితియోపదేశకాండము 24:10-13 లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - నీ పొరుగువానికి ఏదైనను నీవు ఎరువిచ్చియున్న యెడల అతని యొద్ద తాకట్టు వస్తువు తీసుకొనుటకు అతని ఇంటికి వెళ్ళకూడదు. నీవు బయట నిలువవలెను. నీవు ఎరువిచ్చిన వాడు బయటనున్న నీ యొద్దకు ఆ తాకట్టు వస్తువును తెచ్చి ఇచ్చును. ఆ మనుష్యుడు బీదవాడైన యెడల నీవు అతని తాకట్టును ఉంచుకొని పండుకొనకూడదు. అతడు తన బట్టను వేసుకొని పండుకొని నిన్ను దీవించునట్లు సూర్యుడు అస్తమించునప్పుడు నిశ్చయముగా ఆ తాకట్టు వస్తువును అతనికి మరల అప్పగింపవలెను.

**8.** ప్రతి క్రైస్తవుడు బీదలను (....) భక్తిహీనుల చేతిలో నుండి తప్పించాలి :

అందుకే కీర్తనలు 82:4లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - దరిద్రులను, నిరుపేదలను విడిపించుడి. భక్తిహీనుల చేతిలో నుండి వారిని తప్పించుడి.

**9.** ప్రతి క్రైస్తవుడు బీదలకు ...న్యాయము చేయాలి:

అందుకే, కీర్తనలు 82:3లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - పేదలకును, తల్లిదండ్రులు లేని వారికిని న్యాయము తీర్చుడి. శ్రమగల వారికిని, దీనులకును న్యాయము తీర్చుడి. యిర్మియా 22:16లో దేవుని వాక్యము ఈ విధంగా చెప్పుచున్నది. అతడు దీనులకును, దరిద్రులకును న్యాయము తీర్చుచూ సుఖముగా బ్రతికెను. ఆలాగు చేయుటే నన్ను తెలుసుకొనుట కదా?

**10.** ఏ క్రైస్తవుడు బీదలను (....)బాధపరచకూడదు :

అందుకే, సామెతలు 22:22లోను, జెకర్యా 7:10లోను దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - దరిద్రుడని దరిద్రుని దోచుకోవద్దు. గుమ్మమునొద్ద దీనులను బాధపరచవద్దు. దరిద్రులను బాధపెట్టకుడి.

**11.** ప్రతి క్రైస్తవుడు తన పొలమును బీదలు (....) అనుభవించుటకై ప్రతి 7వ సంవత్సరాన దానిని బీడుగా విడువాలి :

అందుకే, నిర్గమకాండము 23:11లో దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - ఆరు సంవత్సరములు నీ భూమిని విత్తి దాని పంట కూర్చుకొనవలెను. ఏడవ సంవత్సరమున దానిని బీడు విడువవలెను. అప్పుడు నీ ప్రజలలోని బీదలు తినిన తరువాత మిగిలినది అడవి మృగములు తినవచ్చును.

**12.** ప్రతి క్రైస్తవుడు తన ఫల వృక్ష తోటలో రాలిన పండ్లను, పొలము పంటలో రాలిన పరిగెను బీదల (....) కొరకు విడిచిపెట్టాలి :

అందుకే, లేవీకాండము 19:1లోను, 23:22లోను దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది - నీ ఫల వృక్షముల తోటలో రాలిన పండ్లను

ఏరుకొనకూడదు. బీదలకును, పరదేశులకును వాటిని విడిచిపెట్టవలెను. మీరు పంట కోయునప్పుడు నీ పొలము యొక్క ఓరలను పూర్తిగా కోయకూడదు. నీ కోతలో రాలిన పరిగెను ఏరుకొనకూడదు. బీదలకును, పరదేశులకును వాటిని విడిచిపెట్టవలెను.

**13.** ఏ క్రైస్తవుడు బీదలకు (....) పక్షపాతము చూపకూడదు:

అందుకే, లేవీయకాండము 19:15లోను, నిర్గమకాండము 23:3లోను దేవుని వాక్యము ఈ విధంగా ఆజ్ఞాపిస్తున్నది – బీదవాడని పక్షపాతము చూపకూడదు. వ్యాజ్యమాడువాడు బీదవాడైనను వాని యెడల పక్షపాతముగా నుండకూడదు.

**14.** ప్రతి క్రైస్తవుడు తన సంఘములో బీదల (....) కొరకై కొంత చందా ధనమును సమకూర్చవలెను :

అందుకే, రోమా 15:26,27లో దేవుని వాక్యము ఈ విధంగా తెలియజేయుచున్నది – యెరూషలేములో ఉన్న పరిశుద్ధులలో బీదలైనవారి నిమిత్తం మాసిదోనియావారును, అకయవారును కొంత సొమ్ము చందా వేయ నిష్టపడిరి... వీరికి సహాయము చేయబద్ధులైయున్నారు.

**ఎఫ్) క్రైస్తవులు బీదలకు (....) సహాయం చేయక పోయినచో (లేదా) బీదలను (....) నిరాకరించినచో దేవుని ద్వారా కలిగే నష్టాలను గూర్చి కూడా దేవుని వాక్యాను సారంగా తెలుసుకుందాం :**

**1.** బీదలను (....) కటాక్షింపకపోయినచో (లేదా) వారికేమి ఇవ్వకపోయినచో అట్టిది క్రైస్తవుల పట్ల పాపముగా పరిగణింపబడుతుంది.

అందుకే ద్వితియోపదేశకాండము 15:9లో దేవుని వాక్యము ఈ విధంగా హెచ్చరిస్తోంది – బీదవాడైన నీ సహోదరుని యెడల కటాక్షము చూపక నీవు వానికేమియు ఇయ్యకపోయిన యెడల వాడొకవేళ నిన్నుగూర్చి యెహోవాకు మొఱ్ఱపెట్టును. అది నీకు పాపమగును.

**2.** బీదలను .. బాధించిననూ (లేదా) వెక్కిరించి ననూ క్రైస్తవులు దేవుని నిందించినవారిగా పరిగణింప బడతారు.

అందుకే, సామెతలు 14:31లోను, 14:5లోను దేవుని వాక్యము ఈ విధంగా హెచ్చరిస్తోంది – దరిద్రుని బాధించువాడు వాని సృష్టికర్తను నిందించువాడు, బీదలను వెక్కిరించువాడు వాని సృష్టికర్తను నిందించువాడు.

**3.** బీదలకు (....) అన్యాయము చేసినచో క్రైస్తవులకు నష్టము కలుగును.

అందుకే, సామెతలు 22:16లో దేవుని వాక్యము ఈ విధంగా హెచ్చరిస్తోంది – లాభము నొందవలెనని దరిద్రులకు అన్యాయము చేయువానికిని ధనవంతులకిచ్చు వానికిని నష్టమే కలుగును.

**4.** బీదలను (....) దోచుకొనినా (లేదా) బాధించినా దేవుడు క్రైస్తవులను చంపుతారు.

అందుకే, సామెతలు 22:22,23లో దేవుని వాక్యము ఈవిధంగా హెచ్చరిస్తోంది – దరిద్రుడని దరిద్రుని దోచుకొనవద్దు. గుమ్మమునొద్ద దీనులను బాధపరచవద్దు. యెహోవా వారి పక్షమున వ్యాజ్యమాడును. ఆయన వారిని దోచుకొనినవారి ప్రాణమును దోచుకొనును.

**5.** బీదలను (....) బాధపెట్టినచో క్రైస్తవులు శత్రువుల ద్వారా హింసించబడతారు.

అందుకే, ఆమోసు 4:2లో దేవుని వాక్యము ఈ విధంగా హెచ్చరిస్తోంది – దరిద్రులను బాధపెట్టుచు బీదలను నలుగగొట్టేవారలారా! శత్రువులు మిమ్మును కొంకుల చేతను, మీలో శేషించినవారిని గాలముల చేతను పట్టుకొని లాగుదురు.

**6.** బీదలకు (....) అన్యాయము చేసిన యెడలను, బీదల (....) యొద్ద లంచములు తీసుకొనిన యెడలను క్రైస్తవుల పాపాలు ఘోరమౌతాయి. వారు ఇండ్లు కట్టుకొని నను వాటిలో నివసించలేరు. పండ్ల తోటలు వేసుకొనినను వాటి రసము త్రాగలేరు.

అందుకే, ఆమోసు 5:11,12లో దేవుని వాక్యము ఈ విధంగా హెచ్చరిస్తోంది – బీదలకు అన్యాయము చేయుట వలన మీ అపరాధములు విస్తారములైనవనియు, మీ పాపములు ఘోరమైనవనియు నేనెరుగుదును. దరిద్రుల యొద్ద పంట మోపులను పుచ్చుకొనుచూ మీరు వారిని అణగ ద్రొక్కుదురు. గనుక మలుపు రాళ్ళతో మీరు ఇండ్లు కట్టుకొనినను వాటిలో మీరు కాపురముండరు. శృంగారమైన ద్రాక్షతోటలు మీరు నాటినను ఆ పండ్ల రసము మీరు త్రాగరు.

సాక్ష్యము

# అబ్రహాం సామ్యేల్ శర్మ

ప్రకాశం జిల్లా తిమ్మసముద్రంలో విశ్వ బ్రాహ్మణులైన ధరణికోట జాలయ్యగారు మాతండ్రి, చంద్రకాంతమ్మగారు నా తల్లి. వారికి ఎనిమిదిమంది సంతానము. ఐదుగురు మగపిల్లలు నేను రెండవవాడిని. ముగ్గురు ఆడపిల్లలు.

మేము పూర్తిగా విగ్రహారాధికులము. మా తండ్రిగారు 1987లో డెబ్భై మూడు సంవత్సరాల వయస్సులో మరణించారు.

తిమ్మ సముద్రము గోరంట్ల వెంకన్న హైస్కూలులో యస్.యస్.యల్.సి. చదివి ఎ.సి. కాలేజి గుంటూరులో కాలేజిలో ప్రి యూనివర్సిటి చదివి చీరాల వి.ఆర్.యస్. అండ్ ఐ. ఆర్.యన్. కాలేజిలో బి.యస్.సి. చదివాను. రెండవ సంవత్సరము చదువుచుండగా రైల్వేలో ఉద్యోగము కొరకు అప్లికేషన్ పెట్టాను. మొదటిసారి ఫెయిల్ అయ్యాను. రెండవసారి పరీక్షలో నలుగురిలో నేను ఒకడినే పాసయ్యాను. కాబట్టి దేవునిక్రియలు అప్పుడే నా జీవితములో ప్రారంభమయినవి నమ్మాను.

విజయవాడ డివిజనులో ఖాళీ లేనందున గుంతకల్ డివిజన్‌లో అపాయింట్‌మెంట్ ఇచ్చారు. తర్వాత తెనాలి బదిలీ అయ్యాను. అప్పుడు మార్చి పదవ తారీఖున, 1966లో అప్పికట్ల దగ్గర నందూరి ఇటికంపాడు గ్రామములోని శ్రీ మృత్యుంజయాచారి ఏకైక కుమార్తె శ్రీ లక్ష్మిగారితో వివాహము అయినది.

ఆమె నిష్ట కలిగిన హిందూ స్త్రీ. పూజలు చేసేది. కులపట్టింపు ఎక్కువ. నలుగురు అబ్బాయిలు పుట్టారు. అందరికి వెంకటేశ్వరస్వామి పేరు వచ్చేటట్లుగా పేర్లు పెట్టుకొన్నాము.

మా రెండవ కుమారుడు ప్రసాద్ రైల్వేలో పనిచేస్తూ ఓ పెద్ద సమస్యతో ఇబ్బంది పడసాగాడు. యేసుప్రభువును నమ్ముకొనినందున అందులోనుండి బయటపడి యేసు ప్రభువును నమ్ముకొని బాప్తీస్మము తీసుకొని ఇంట్లో తల్లిదండ్రులకు అన్నదమ్ములకు యేసును గూర్చి సాక్ష్యమిస్తుండేవాడు.

నా భార్యకు జబ్బు చేసినప్పుడు అనేకమైన క్రైస్తవ సహోదరులు సహోదరీలు మా ఇంటికి వచ్చి స్వస్థత కొరకు ప్రార్థించేవారు. ఆమె యేసును నమ్ముకొని జూలైనెల మూడవ తారీఖున 2000వ సంవత్సరములో చనిపోయింది.

నాకు చాలా దురలవాట్లు ఉండేవి. నేను యేసుప్రభువును నమ్ముకొని రక్షింపబడి అన్ని దురలవాట్ల నుండి విడుదల పొందాను. ప్రసాద్ 1996లో బాప్తీస్మము తీసుకున్నాడు. అతని భార్య 1999లో బాప్తీస్మము తీసుకున్నది. పెద్దకొడుకు 2007లో, కోడలు కూడా బాప్తీస్మము తీసుకున్నది. నేను బాప్తీస్మము తీసుకొని అబ్రాహాము సామ్యేలుగా పేరు మార్చుకున్నాను.

ఉద్యోగరీతిగా నేను డిప్యూటి చీఫ్ కంట్రోలర్‌గా విజయవాడలో రిటైరయ్యాను.

2009 ఆగష్టులో నాకు కడుపులో విపరీతమైన నొప్పి వచ్చినది. పొన్నూరులో చిట్టిబాబు హాస్పిటల్‌లో వారం రోజులు ఉన్నాను. తర్వాత నా కుమారుడు ప్రసాద్ విజయవాడలో దేవుని బిడ్డ అయిన డా. జాషువ గారి దగ్గర ట్రీట్‌మెంట్‌లో స్కానింగ్ చేయించినప్పుడు గాల్‌బ్లాడర్‌లో రాళ్ళు ఉన్నట్లు తెలిసింది. సికింద్రాబాద్‌లో రైల్వే డాక్టరుగారు ఓపెన్ సర్జరీ చేశాడు.

తర్వాత కేర్ హాస్పిటల్‌లోకి పంపారు. అక్కడ డ్రైనేజ్ హోల్‌లో ఇంకా లీకేజి ఉన్నందువల్ల కడుపులో స్టంట్ వేశారు. ఒకనెల తర్వాత ఎక్స్‌రే, స్కానింగ్‌తో వచ్చి స్టంట్ తీయించుకోమన్నారు. స్టంట్ వేసిన తర్వాత తిరిగి సికింద్రాబాద్ రైల్వేహాస్పిటల్‌కు కూడా వచ్చాను. ఒకరోజు నాకు షుగర్ డౌన్ అయి మా అబ్బాయిని కూడా గుర్తుపట్టలేని పరిస్థితిలోకి వచ్చాను. అప్పుడు మా అబ్బాయి అక్కడ ఉన్న నర్సుకు చెబితే వెంటనే సెలైన్ పెట్టారు. నేను కోమాలోకి పోకుండా యేసుప్రభువు నన్ను కాపాడాడు.

తర్వాత నెలకు ఎక్స్‌రే, స్కానింగ్ తీసుకొని సికింద్రాబాదు వెళ్ళాను. డాక్టరుగారు వాటిని చూసి, స్టంట్ లోపలలేదు. అది బయటకు వెళ్ళిపోయింది అని చెప్పారు. దేవునికి స్తోత్రం!

డ్రైనేజి హోల్ నుండి ఆపరేషను చేసిన నాటినుండి పదిహేను నెలలు లీకేజి అవుతూనే ఉంది. చీము పట్టలేదు, నొప్పిలేదు. నేను అనేక హైస్పిటల్స్‌కు వెళ్ళాను. ఇంగ్లీషు, హోమియో, ఆయుర్వేదం దేనితో బాగు కాలేదు. విజయవాడ రైల్వే హాస్పిటల్‌లలో ఆ డ్రైనేజి హోల్ నుండి ఏదో ఇంజక్షన్ మందు ఇప్పించి ఎక్స్‌రే తీశారు. అందులో లోపల గాయం తెరుచుకుని ఉన్నట్లుగా తెలిసింది. వెంటనే రైల్వే డాక్టరు – బెడ్‌లో చేరు. ప్రమాదం ఏమీలేదు. ఆపరేషన్ నేను చేస్తాను అన్నారు. బెడ్‌లో చేరినతర్వాత గ్లోబల్ ప్రైవేటు హాస్పిటల్‌కు పంపించి యమ్.ఆర్.జి. స్కానింగ్ తీశారు. దానిలో ఓపెన్ సర్జరీ చేసినప్పుడు ఒక పెద్ద సైజులో రాయి వున్నట్లుగా రిపోర్టు వచ్చింది. అప్పుడు నేను భయపడి నన్ను ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపమని డాక్టరును ప్రాధేయపడ్డాను. కానీ డాక్టరు ప్రైవేట్ హాస్పిటల్‌కు పంపడానికి ఒప్పుకోలేదు. నేను, నా రెండవ కుమారుడు ప్రసాద్, నాగార్జున ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్ళి, దానికి సంబంధించిన సర్జనును కలిశాము. మళ్ళీసర్జరీ చేయాలి. సర్జరీకి నలభై వేలు అవుతుంది అని చెప్పారు. తిరిగి రైల్వే హాస్పిటల్‌కు వచ్చి డాక్టరుగారికి చెప్పినా ఆయన ప్రైవేటు హాస్పిటల్‌కు పంపడానికి పూర్తిగా తిరస్కరించారు.

తిరిగి మళ్ళీ విజయవాడ రైల్వేహాస్పిటల్ బెడ్‌లో ఒక వారం రోజులు ఉన్నాను. వారం తర్వాత ఏ డాక్టరైతే ప్రైవేటుకు పంపనన్నాడో ఆయనే ఆ వార్డు ఇన్‌ఛార్జ్‌కి నన్ను నాగార్జున హాస్పిటల్‌కు పంపమన్నాడు. ఆవిధంగా యేసు ప్రభువు ఆ డాక్టరుగారి మనసు మార్చి నన్ను నాగార్జున హాస్పిటల్‌కే పంపారు. అక్కడ డిశెంబరు తొమ్మిదవ తేదీన లాప్రోస్కోపీ ద్వారా ఆపరేషన్ చేశారు. జయకరముగా యేసుప్రభువు వల్ల బయటకు వచ్చాను. ఆర్థికమైన ఇబ్బంది లేకుండా నన్ను స్వస్థపరిచాడు. యేసుప్రభువుకు స్తోత్రం!

ద్వితి 32:39 ప్రకారం ఇదిగో నేను నేనే దేవుడను, నేను తప్ప వేరొక దేవుడులేడు. మృతినొందించువాడను బ్రతికించువాడను నేనే. గాయపరచువాడను స్వస్థపరచు వాడను నేనే. నా చేతిలోనుండి విడిపించువాడెవడును లేడు. అను వాక్యము గుర్తుచేసుకొని దేవునిని స్తుతించాను. పదవ తారీఖు జనవరి 2011న మా ఇంటి వద్ద ఎంతోమంది హిందువుల మధ్య కృతజ్ఞతా కూటమి జరిపించి దేవుని మహిమపరిచాము. మహిమ, ఘనత, ప్రభావములు ప్రభువైన యేసుక్రీస్తుకు చెందును గాక!

---

# కొడవటికంటి రచనలు

1. మడిమెను పట్టుకొనినవాడు
2. జప్నత్పనేహు
3. ఆసెనతు
4. అపోస్తలుడు
5. బర్నబా
6. తిమోతి
7. నా చిత్తానుసారుడు
8. గుంట నుండి మింటికి
9. విశ్వాసంలో ఓ మెట్టు
10. తోటలోని పనివాడు
11. గోత్రకర్త
12. నా కుటుంబము
13. నా దూత
14. నా కుమారి
15. సువార్తలలోని యేసుకథ
16. అంత్యదినములలోని యదార్థ ప్రవక్త
17. హన్నాకృప సజీవసాక్ష్యాలు
18. ప్రయాణంలో ఓ మజిలి
19. నా స్నేహితుడు

✦ ✦ ✦

20. విశ్వాసంలో మరో మెట్టు
21. యేసుకథ రెండవ భాగం
22. జీవనమంతయు

## 3వ పేజి తరువాయి భాగం

సొమ్మును, ఆయన బిడ్డల సొమ్మును ఎలా తెలివిగల దొంగ వలె దోచుకున్నారో, దొంగలు దొంగలు పంచుకొని వాళ్ళలో వాళ్ళు గొడవలు పడటమేకదా!

అయితే ఈ దేశాన్ని మాటతో, చూపుతో పరిపాలించిన కొందరు – వాళ్ళకు సొంత ఇల్లు కూడా లేకుండా వెళ్ళిపోయారు. అయితే వాళ్ళు నెమ్మదిగా జీవించి ఇతరులను జీవింపజేశారు. వాళ్ళ ఫోటో చూసినా మన హృదయంలో నెమ్మది పుడుతుంది, సమాధానము వస్తుంది.

కనుక దేవుడు నాతో చెప్పేమాట ఏదయినా నాకు దీవెనకరముగా, ఆరోగ్యకరముగా ఉండాలని చెప్పాడే కాని, ఆయన ఈ సమస్య మనము కోరిన రీతిలో పరిష్కరించే శక్తి ఆయనకు కొరవై యుండినందువలన కాదు.

ఆయన సర్వశక్తిగల ప్రేమగల దేవుడైయుండి తన బిడ్డలను చేవలేని వారివలెను, బీదలవలెను జీవింపజేయ వలెనని కాదు. యేసును వెంబడించిన పౌలు చేతిలోని ఆయుధములను వదలి, రాజులకు ప్రవర్తనావళి నియమించాడు. అతను కత్తిపట్టుకొని తిరిగినన్నాళ్ళు అతనికే నెమ్మది లేకుండినది.

కోటీశ్వరుడైన పౌలు – ఓ రాజు స్థితి కలిగిన ఫేలిక్సు – పౌలు వలన తనకు ద్రవ్యము దొరుకునని ఆశించాడు. కాబట్టి అటువంటి పౌలు దేవుని చట్టము ఎరిగి యేసును ఎరుగు నిమిత్తము సమస్తమును నష్టపరచుకొని వాటిని పెంటతో సమానముగా ఎంచుకున్నాడు.

అయినా దేవుడు మనలనందరిని పౌలువలె చెరసాల పాలు చెయ్యలేదు. కాని రాజులైన యాజక సమూహముగా ఈ లోకంలో జీవించినంతకాలం తన తల ఎత్తుకొని ఇతరులకు తల వలె జీవింపజేశాడు.

విస్తారమైన ప్రయాణాలలో, పరిసరాలలో నేను గమనించినదేమంటే దేవుని ప్రేమించి, బీదలను కటాక్షించే వారు, దేవుని మందిరమును ప్రేమించి దశమభాగము ఆయన మందిరములోనికి తెచ్చినవారు ఆయనను ప్రేమించి ఆయన పనివారికి సమృద్ధిగా ఆర్థిక సహాయం చేసేవారు – ఎవరు? వారి స్థాయికి మించిన విధంగా చందా ఇచ్చేవారు ఆయురారోగ్యములతో నెమ్మది అయిన ప్రశాంత జీవితం కుటుంబసమేతముగా గడపడం చూసి నేను దేవుని స్తుతించాను.

మీరు కూడా అటువంటి వారిని గమనించి చూడండి! వారి ఆనందానికి, ఆరోగ్యానికి కారణం దేవుని మాటలను తు.చ. తప్పకుండా నడచుకొని – పట్టజాలనంత దీవెనలు పొందారు కాని, దేవుని సన్నిధిలో ప్రార్థించి ప్రార్థించి ఇతరులను మాకోసం ప్రార్థించమని బ్రతిమలాడి పొందలేదు.

చాలామంది చందా ఇచ్చి మేము చాలా ఇచ్చాము అనుకొంటారు. కాని ప్రభువు **నీ జీవనము** ఎంతో, నువ్వు ఎంత ఇచ్చావో చూస్తున్నాడు.

మన దగ్గర చాలా ఉండవచ్చును. కాని మన దగ్గర ఆశీర్వదించబడిన ఒక్క రూపాయి గొప్ప పనులు మన కుటుంబములో జరుపుతుంది. దేవుని ఆశీర్వాదములేని వందరూపాయలు ఒక్కరూపాయి చేసే పనికూడా చెయ్యలేదు.

ఆశీర్వదించబడిన ఒక్క రూపాయి కలిగినవాడే ఆస్థిపరుడు. అతనికి డబ్బుమీద కంటే దేవుని మీదనే స్థిరమైన నమ్మకము ఉంటుంది.

అంతకుముందు నేనెన్నడు చూడని ఆమె పేరు (పులుకూరి సూర్యకాంతము) నేనెన్నడు వినియుండలేదు. మొదటిసారి నన్ను చూచి నా చేతిలో ఐదువందల కాగితం పెడుతూ మీ పత్రికకు నేను ప్రతినెల ఐదువందలు కానుక పంపించే మార్గము చెప్పండి అన్నది. నేను ఆన్‌లైన్ నెంబరు పత్రికలో చూపించాను. ఆమె వయస్సు 71సంవత్సరాలు. ఆమెలో ఈ భావన ఎందుకు కలిగింది? ఆమె తన **జీవన మంతయు** దేవునికిచ్చినట్లుగా నాకు కనిపించింది.

రాత్రి తొమ్మిది గంటలకు గుంటూరు నుండి సుబ్బారావుగారు ఫోన్‌చేసి మీ అకౌంటులో అయిదు వందలు వేశాను. దయచేసి నా పేరు పబ్లిష్ చెయ్యవద్దు అన్నాడు. ఆయన తన అవసరతలు చెప్పలేదు. తన పనులు ప్రభువు చూస్తున్నాడని నమ్మకము మాత్రమే కదా!

## క్విజ్ డిసెంబర్ నెల ప్రశ్నలు 80

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

**యిర్మీయా 21 - 30వ అధ్యాయము వరకు**

**1. యెహోవాను తెలుసుకొనుట అంటే ఎలాగు చేయుట?**

**2. శాప వచనముగ వాడబడిన పేరుగల సిద్కియా, ఆహాబులు ఎవరు?**

## నవంబర్ నెల ప్రశ్నలకు జవాబులు:

**1. జంతువులు, పక్షులు అంతరించి పోవుచున్నవని పర్యావరణ వేత్తలు వాపోవుచున్నారు. దానికి ప్రభువు చెప్పు కారణమేమి?**

**జవాబు:** దేశములో నివశించువారి చెడుతనము

**(యిర్మీయా 12 : 4)**

**2. యిర్మీయాను దేనితో కొట్టవలెనని జనులు చెప్పుకొన్నారు?**

**జవాబు:** మాటలతో

**(యిర్మీయా 18 :18)**

**జవాబులు ప్రయత్నించినవారు :**

**శ్రీ బి. జీవరత్నం (హైదరాబాదు)**
**శ్రీమతి పి.యమ్. సుశీలా రాజారావ్ (సత్తుపల్లి)**
**శ్రీమతి టి. క్రిష్టియానమ్మ (నందికొట్కూరు)**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి (హైదరాబాదు)**

## ఈ నెల పోషకులు :

**సెప్టెంబర్ 20 నుండి అక్టోబర్ 20, 2011 వరకు మాకు చేరినవి.**

| | | |
|---|---|---|
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాదు | 2000 |
| శ్రీ నిమ్మగడ్డ సుధీర్ | హైదరాబాదు | 2000 |
| డా॥ జడ్.సి. దేవదానం | కర్నూలు | 1000 |
| బ్రదర్ షాలేమ్ విక్రాంత్ వర్ధన్ | గుంటూరు | 1000 |
| అపోస్తలుడైన ఎబినెజరు | హైదరాబాదు | 500 |
| బ్రదర్ సి.ఎల్.హెచ్. బెన్నిసన్ | బెంగుళూరు | 500 |
| శ్రీమతి పులుకూరి సూర్యకాంతం | నెల్లూరు | 500 |
| కుమారి కె. ప్రసన్నభారతి | ఒంగోలు | 500 |
| బ్రదర్ మద్దిరాల బోయజు | ఒంగోలు | 500 |
| శ్రీమతి కూచిపూడి సౌభాగ్యం | ఒంగోలు | 200 |
| శ్రీ తెంటు చంద్రశేఖర్ | విజయవాడ | 200 |
| శ్రీ జంగాల ఆనందం | ఒంగోలు | 200 |

✦ ✦ ✦

| | | |
|---|---|---|
| శ్రీమతి కట్టా నాగేశ్వరి భాస్కర్ | హైదరాబాదు | 2000 |
| శ్రీమతి వేదమణి | పులివెందుల | 1500 |
| శ్రీ బొప్పూరి తరుణ్ కుమార్ | విజయవాడు | 1000 |
| బ్రదర్ స్టాలిన్ | మీరజ్ | 1000 |
| శ్రీ&శ్రీమతి ముక్కు సతీష్ రెడ్డి | కనిగిరి | 1000 |
| బ్రదర్ దేవదానం | ఒరిస్సా | 1000 |
| శ్రీ ముద్దా విల్సన్ సామ్యేలు | నెల్లూరు | 1000 |
| శ్రీ కట్టా వినయ్‌కుమార్ | చీరాల | 1000 |
| శ్రీమతి మల్లెల కుమారి | బాపట్ల | 1000 |
| శ్రీమతి పావని పాల్ | చినరావూరు | 1000 |
| శ్రీమతి సంపూర్ణ సాలమన్‌రాజు | నరసారావుపేట | 1000 |
| శ్రీ అబ్రహాం సామ్యేల్ శర్మ | పొన్నూరు | 500 |
| శ్రీ కె. సత్యకీర్తి | నెల్లూరు | 500 |
| శ్రీ పాల్ | చినరావూరు | 500 |
| శ్రీమతి రక్షణ | కనిగిరి | 500 |
| శ్రీ జీవరత్నం | హైదరాబాద్ | 500 |
| శ్రీమతి కనికరమ్మ | కోలవెన్ను | 500 |
| రెవ. డేవిడ్ నీలకాంత్ | నెల్లూరు | 500 |
| శ్రీమతి మేరి హేమలత | ఇనుగుర్తి | 300 |
| శ్రీ కొడమలి ఏలియా | బిలాయ్ | 200 |
| శ్రీ బొప్పూరి విజయం | బెస్తవారిపేట | 200 |
| శ్రీ మాల్యాద్రి | కావలి | 200 |
| శ్రీమతి శ్రీదేవి | విజయనగరం | 200 |
| శ్రీ ఎన్.జె.వి. ప్రసాద్‌రావ్ | విశాఖ | 200 |
| శ్రీ లిల్లీ సుందరం | ఒంగోలు | 200 |

పెద్ద కథ

# విశ్వాసంలో మరో మెట్టు

25

2001లో సామ్యేల్ బంధువైన ఓ అబ్బాయికి చదువు అబ్బలేదని ప్రకాశం జిల్లా వేటపాళెంలో ఉన్న గవర్నమెంట్ వృత్తి విద్యాకేంద్రములో చేర్పించారు. కొన్ని నెలలైన తరువాత ట్రైనింగ్ పూర్తి చేసుకొని ఒంగోలు వచ్చాడు. తను నేర్చుకొనిన విద్యననుసరించి టేబుల్ ఫ్యాన్ బాగుచేశాడు. అలాంటివే చిన్న పనులు చాలాచేశాడు. కాని ఎప్పుడు తనతో పాటుగా మరో యవ్వనస్తుని తీసుకొని వచ్చేవాడు. ఆ అబ్బాయి హిందువు. అసలు యేసు అనే పేరు కూడా తెలియనివాడు. తల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. సన్నగా - నొక్కుల జుట్టు - చామనఛాయ. ఎవరితో ఏమీ మాట్లాడేవాడు కాడు. మాట్లాడితే తన స్నేహితులతోనే మాట్లాడేవాడు. వారు చేసిన ప్రతి పనికి డబ్బులు ఇస్తుండేవాడు సామ్యేలు.

తరువాతి కాలంలో సామ్యేలు బంధువైన అబ్బాయి వాళ్ళ ఊరువెళ్ళిపోయి మరలా ఏదో చిన్న చిన్న పనులు చేసుకుంటూ ఇంటివద్ద ఉంటున్నాడు. అతను కూడా వాళ్ళతల్లిదండ్రులకు ఒక్కడే కుమారుడు. సిగెరెట్లు తాగుతూ, పాన్ నములుతూ, స్నేహితులతో వాళ్ళ ఊరిలో నివశిస్తు న్నాడు. కానీ ఈ యవ్వనుడు ఒంగోలుకు నాలుగు మైళ్ళ దూరంలో వాళ్ళ తల్లిదండ్రులతో జీవిస్తూ ఎక్కడయినా సంస్థలలో పార్ట్ టైం పనిచేస్తుండేవాడు. సామ్యేలు ఇంటిలో కాని, చర్చిలో కాని ఏదైనా కరెంటు లోపము అయితే ఈ అబ్బాయికి ఫోన్ చేస్తే వచ్చి పనిచేసి వెళ్ళేవాడు. అలా ఓ సంవత్సరం గడిచిపోయింది.

అతని పేరు సుధీర్! ఓ రోజు ఏదో పనిమీద సుధీర్‌ను పిలిపించాడు. అతను వచ్చి ఆ పని పూర్తి చేసి ఆఫీసులో కూర్చున్నాడు. పని అయిపోయింది. సుధీర్‌కి కొంత డబ్బులు ఇచ్చాడు. అయినా అతను అలానే కూర్చున్నాడు. కొంచెంసేపు గడచిన తర్వాత యేసును గురించి ఇంకా తెలుసుకోవాలంటే నేనేమి చెయ్యాలండి? అన్నాడు.

ఎవరో లాగి సామ్యేలును చెంపమీద కొట్టినట్ల యింది. ఎక్కడెక్కడికో తిరుగుతున్నాడు. దూర ప్రయాణాలు చేస్తున్నాడు. అలసిపోతున్నాడు. పుస్తకాలు రాస్తున్నాడు, పత్రిక నడిపిస్తున్నాడు. ఎందుకు? మాకొరకు ప్రార్థించండి అని అడిగిన వారి పేర్లు గుర్తు పెట్టుకొని మరీ ప్రార్థిస్తున్నాడు, ఎందుకు? ఎక్కువ ప్రార్థనలు అనారోగ్యముతో ఉన్నవారి కొరకే! అంతే కాదు ప్రార్థించమని - ప్రార్థనలో పెట్టండి అని చెప్పేవాళ్ళలో ఎక్కువమందికి అది ఓ ఊతపదం. వాళ్ళు అసలు ప్రార్థన చేసుకోరు. కాని ప్రతి ఒక్కరిని మా కొరకు ప్రార్థించమని ఓ పాటలాగా పాడుతుంటారు.

ఈ యవ్వనస్తుడు సుధీర్ - అన్యుడు. మంచి వాడో, చెడ్డవాడో కూడా సామ్యేలుకు తెలియదు.ఎన్నడు అతని గురించి ఆలోచించలేదు. కానీ అతను సామ్యేలు గురించి ఆలోచించాడు. సామ్యేలు ఆఫీసుకు రావడం మొదలుపెట్టిన తర్వాత యేసును గురించి ఆలోచించసాగా డన్నమాట. యేసులో ఉన్న కొంత ప్రేమను అతను రుచిచూచి ఉండాలి. కాకపోతే యేసును గురించి అడుగడు కదా! సామ్యేలయితే తన ఎదురుగా ఉన్న వ్యక్తికి యేసును అందించాలన్న ఆలోచన కూడా రాలేదు. సుధీర్‌కి కాని మరో సువార్తికుడు తెలిసివుంటే అతనినైనా - యేసు ఎవరు? అని అడిగి ఉండేవాడు. ఇంతకాలంగా ఒక్కసారైనా సుధీర్ ఆత్మీయజీవితం, అతని కొరకు కూడా యేసు శిలువలో రక్తం కార్చి అతనికి రక్షణ ఇచ్చాడనే విషయమైనా సామ్యేలు అతనికి చెప్పలేదు. ఏదో కరెంటు పని చేసుకొంటున్న పిల్లవాడిగానే సామ్యేలు చూపు ఉండినది. కాని అతను కూడా దేవుని రాజ్యమునకైన ఓ ఆత్మ అని సామ్యేలు ఎన్నడు భావించలేదు.

యడవల్లి ప్రసాద్‌రావుగారు పెద్ద ఆఫీసరే! అయినా ఆయన తన వద్ద ఆఫీసులో కానీ బయటకాని పనిచేసే ఎంత చిన్న ఉద్యోగికయినా ముందు - యేసును గురించి ఆయన శిలువ మరణాన్ని గురించి యేసు ప్రేమగురించి

చెపుతుంటాడు. ఈ అయిదు సంవత్సరాలలో ఆయనతో ఎన్నో ప్రయాణాలు చేశాడు సామ్యేలు. ఎక్కడయినా ఎవరికైనా డ్రైవరు, ఆఫీస్‌బాయ్, స్వీపరు అందరికి యేసును గురించి ప్రసాద్‌రావుగారు చెబుతుంటారు.

సుధీర్ విషయంలో సామ్యేలు పొరపాటు మాత్రమే కాదు. తన కప్పగించబడిన పనిని తను సరిగా చెయ్యడం లేదని తెలుసుకున్నాడు సామ్యేలు. తన ఆఫీసులోకి ఎవరు వచ్చినా వారిని దేవుడు పంపించాడని తెలుసుకున్నాడు. వారి రక్షణ బాధ్యత తనపై ఉన్నదని తెలుసుకున్నాడు సామ్యేలు.

అప్పటినుండి సుధీర్ ప్రశ్నలకు జవాబులు చెబుతుండేవాడు.. తరచు సామ్యేలు దగ్గరకు వస్తుండేవాడు. అతను ఆత్మలో, దేవునిలో బాగా ఎదగడం గమనించాడు. సుధీర్ ప్రతి ఆదివారం చర్చికి వెళ్తుండేవాడు. అతనిలో చదువుకోవాలనే ఆసక్తి పెరిగింది – అదే అతనికి మొదటి దీవెన.

చదువు ఆగిపోయి చేతివృత్తి ట్రైనింగ్ అయ్యాడు. ఆ చేతివృత్తిలో తన జీవితం సాగింది. అతని హృదయము లోకి చదువు మీద ఆసక్తి అమితంగా దేవుడు పుట్టించాడు. స్వతహాగా డబ్బులేనివాడే అయినా తను నేర్చుకొనిన విద్యతో డబ్బు సంపాదించుకుంటూ ప్రైవేటు కళాశాలలో చేరి ఇంటర్ పాసయ్యాడు.

కాలేజిలో ఎదురైన అవరోధాలను మనసులో ప్రార్థన చేసుకుంటూ వెళ్ళి ఏవిధంగా పరిస్థితులను జయించింది సామ్యేలుకు చెబుతుండేవాడు.

ఓసారి ఓ క్రైస్తవ ప్రార్థనా మందిరములో తను రెండు చేతులు పైకెత్తి దేవుని మొట్టమొదటిసారి ఆరాధించా డని సామ్యేలుతో చెప్పాడు. "చేతులెత్తి ఆరాధించాను" అనే శీర్షికమీద హన్నాకృపలో ప్రచురమైనది.

తర్వాత బి.యస్సీ.లో చేరాడు. మూడు సంవత్స రాలు చదివాడు. కాలేజి ఆఖరిరోజు రికార్డు పనిలో దానిమీద సంతకము చేయవలసిన మాస్టారుతో అనుకూల పరిస్థితులు లేనప్పుడు దేవుడు ఓ గొప్ప ఆశ్చర్యకార్యము చేసిన సంగతి సాక్ష్యము చెప్పాడు. అది హన్నాకృపలో ప్రచురమైనది.

బి.యస్సీ. ఎలక్ట్రానిక్స్‌లో పాసయ్యాడు. యం.సి.ఎ. చదవాలనుకున్నాడు. కాని డబ్బులేదు. ఎక్కడైనా ఫీజులు ఎక్కువగా ఉన్నాయి. ఈ సంగతి సుధీర్ సామ్యేలుకు చెప్పలేదు. సుధీర్ ఎక్కడ అప్పు చెయ్యలేదు. ఎవరిని సహాయం అడుగలేదు. తన హృయంలో తను ప్రార్థించుకునే వాడు కానీ, నా కొరకు ప్రార్థించండి అని ఎవరిని అడుగ లేదు. ఓ సంవత్సరం చదువుకు ఆర్థికస్థితి అడ్డువచ్చి ఆగాడు. తన తోటివారు చదువుకొని ముందుకు వెళ్తున్నారు అని అనుకొనేవాడు. కాని తల్లిదండ్రుల్ని డబ్బుయిమ్మని బలవంతం చెయ్యలేదు. అది యేసు నేర్పిన జీవితం.

తమిళనాడులో అభిరామిపట్నం – తంజావూరులో ఉన్నది. అక్కడ తను కట్టగలిగిన డబ్బుతో యం.సి.ఎ. చదువు వీలు పడుతుందని తెలిసి 2007నుండి 2010వరకు అక్కడ యం.సి.ఎ. పూర్తిచేశాడు.

హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఉద్యోగం ఎలా దేవుడు సమకూర్చింది, సామ్యేలుకు చెప్పాడు. హైదరాబాదులో ఉద్యోగములో చేరిన తర్వాత నా తోటివారు నాకు సీనియర్సుగా ఉన్నారని బాధపడేవాడిని కాని దేవుని కూడా ఎన్నడు ఏ విషయం అడుగలేదు. ఎందుకంటే ఇప్పుడు నేనున్న స్థితి దేవుడు నాకిచ్చింది అని ఓసారి సామ్యలుతో చెప్పాడు.

ఉద్యోగంలో మొదటి జీతం తీసుకొని మొదటిగా దశమభాగము దేవునికిచ్చాడు. లెక్కకట్టి ప్రతినెల దశమ భాగము దేవునికిచ్చేవాడు.

ఇది ఇలా జరుగుతుంటే ఓరోజు సామ్యేలుకు హైదరాబాద్ కూకట్‌పల్లి నుండి ఫోన్ వచ్చింది. 'నా పేరు అశోక్! కల్వరిలో ఉంటాను. మీ పుస్తకాలు ఓ సెట్ కల్వరి, పోస్ట్‌బాక్స్ నెం.30, కూకట్‌పల్లికి పంపిస్తారా?' అని అడిగాడు. 'కల్వరి టెంపుల్, పోస్ట్‌బాక్స్‌నెం.30, కూకట్ పల్లి అంటే కొరియర్ ఎలా వస్తుంది?' అన్నాడు సామ్యేలు.

'మీరు పంపించండి, వస్తుంది' అని మీ అకౌంట్ లో వెయ్యిరూపాయలు వేస్తున్నాను' అన్నాడు. ఆ స్వరము చాలా లేతగాను, మృదువుగాను ఉన్నది. సామ్యేల్ ఓ సెట్ పుస్తకాలు పంపించాడు. కాని వాటి ఖరీదు అప్పుడు అయిదు

వందలే! సామ్యేలుకు ఓ రోజు హైదరాబాద్ వెళ్ళవలసిన పని వచ్చింది. సామ్యేలు అశోక్‌కి ఫోన్ చేసి కల్వరి టెంపుల్ వద్ద ఉదయం ఆరు గంటలకు బస్ దిగాడు. కల్వరి టెంపుల్ వద్దనే బస్ ఆగింది. సామ్యేలు పుస్తకాల సంచి చాలా పెద్దది. బస్‌దిగి ఆ బ్యాగ్ భుజానికి తగిలించుకొంటుంటే ఓ యవ్వనుడు రోడ్‌మీదకు వచ్చి ఆ బ్యాగ్ తను తీసుకొని మెట్లు ఎక్కడం ప్రారంభించాడు. 'మీ పేరు అశోక్?' అన్నాడు సామ్యేలు. 'కాదండి, అశోక్ పైన ఉన్నాడు' అన్నాడు.

విశాలమైన పెద్ద గది. అంతా ఎఱ్ఱ కార్పెట్ పరిచి ఉంది. లోనికి రాగానే మరో యవ్వనస్తుడు వచ్చి ఓ కుర్చీ వేసి 'కూర్చోండి!' అన్నాడు. అయిదు నిమిషాలు గడిచాయి. అశోక్ కోసం ఎదురు చూస్తున్నాడు సామ్యేలు. మరో యవ్వనస్తుడు ఓ కప్పు వేడి కాఫీ తెచ్చి ఇచ్చాడు. ఓ ఫ్యామిలీ హౌస్‌లో కూడా ఇంత తొందరగా కమ్మని కాఫీ తయారు చెయ్యలేరు అనుకొంటూ కృతజ్ఞతతో కాఫీ తాగాడు.

ఎఱ్ఱగా, సన్నగా, మృదువుగా ఉన్న ఓ యవ్వనస్తుడు వచ్చి చేయి కలుపుతూ నేను అశోక్‌ని అన్నాడు. ఆ హాలులో ఓ స్టేజ్‌లాంటిది ఉన్నది. ఎవరెవరో యవ్వనస్తులు వచ్చి అక్కడ మోకరించి ప్రార్థన చేసుకొని వెళ్తున్నారు.

'వీరంతా ఎవరు?' అన్నాడు సామ్యేలు. 'వీరంతా సాఫ్ట్‌వేర్ పనిచేసుకొంటూనే ఈ కల్వరి టెంపుల్ సేవలో పాల్గొంటారు' అన్నాడు అశోక్.

'ఎంతమంది?' అన్నాడు సామ్యేలు.

'సుమారు ఎనభైమంది ఉండవచ్చును. సతీష్ కుమార్‌గారు ప్రారంభములో ఇక్కడే ఆరాధన జరిపేవారు. ఇప్పుడు ఎదురుగా ఉన్న నయినా గార్డెన్స్‌లో ఆరాధనలు జరుగుతుంటాయి. సుమారు ఆరువేల కుర్చీలు వేయాల్సి ఉంటుంది' అన్నాడు. 'మరి నా బుక్స్ మీకెలా తెలుసు?' అన్నాడు సామ్యేలు. 'ఇక్కడి యవ్వనస్తులలో ఒకరు మీ తిమోతి పుస్తకం చదువుతుంటే సతీష్‌కుమార్ గారు చూసి, ఆ పుస్తకం చదివి, ఈ రచయిత పుస్తకాలు అన్నీ తెప్పించ మని నాతో చెప్పారు' అన్నాడు అశోక్.

'మరి వెయ్యిరూపాయలు పంపించారే?' అన్నాడు సామ్యేలు. 'రకానికి ఐదు పుస్తకాలు పంపించండి' అన్నాడు అశోక్. ఆ విధముగా అశోక్‌తో పరిచయము... రోజులు గడిచేకొలది చాలా ఎక్కువ ఆత్మీయబంధముగా అయింది. ఓరోజు సతీష్‌కుమార్‌గారి ఆఫీసులో ఓగంట వారితో మాట్లాడిన తర్వాత వారు వ్రాసిన పుస్తకాలు కొన్ని తీసుకొని హన్నాకృపలో వారు వ్రాసినవి సీరియల్‌గా ప్రచురించాడు సామ్యేలు.

హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న సుధీర్‌కి కల్వరి టెంపుల్‌కి వెళ్ళమని ఫోన్ చేశాడు. అప్పటినుండి సుధీర్ సామ్యేల్ నాల్గవ కుమార్తె రణిత, అల్లుడు, ఇద్దరు మనుమ రాండ్రు కల్వరికి ప్రతి ఆదివారం హాజరయ్యారు.

అల్లుడు శ్రీనివాసు అన్యుడు – సివిల్ ఇంజనీర్. అయితే ప్రభువులో ఎదిగే కొలది బాప్తీస్మము తీసుకున్నాడు. 1994లో తెనాలి దగ్గర బట్టిప్రోలు దగ్గర జిలుగువారిపాళెం వాస్తవ్యులు శ్రీ ఎంద్రపాటి సంగీతరావుగారు తన పెద్ద కుమారుడు సివిల్ ఇంజనీరుగా హైదరాబాద్‌లో ఉన్న శ్రీనివాసరావుకు సామ్యేలు నాల్గవకుమార్తె రణితను వివాహమునకు అడిగారు. పెద్దపులిఏఱులో క్రైస్తవ వివాహము జరుగుచున్నప్పుడు స్థానిక పాస్టరుగారు వీరికి యేసు అనే పేరు కూడా తెలియదు. అయినా క్రైస్తవ వివాహము చేసుకుంటున్నారు అని సామ్యేలుతో చెప్పారు.

అప్పటినుండి సామ్యేలు ప్రభువా! జిలుగువారి పాళెంలో ఈ ఇంటినుండి నీ వెలుగు ఈ గ్రామమంతా ప్రకాశింపనియ్యండి అని విడువక ప్రార్థించనారంభించాడు. వారికి ఓ బైబిలు ఇచ్చాడు.

రెండు సంవత్సరాలు గడిచిన తర్వాత హైదరాబాద్ లో తన కుమార్తె రణిత ఇంటికి వచ్చాడు సామ్యేలు. రణిత అత్తగారు, మామగారు కూడా జిలుగువారిపాళెం నుండి వచ్చి ఉన్నారు. సామ్యేలు ఓ గదిలో నిద్రిస్తుండగా ఎవరో ఏడుస్తూ మాట్లాడుతున్నట్లుగా వినిపించి తలుపు తెరిచి చూచాడు. రణిత అత్తగారు రాత్రి రెండు గంటల సమయం లో మోకరించి ప్రార్థిస్తున్నది.

దేవుని నామమునకు స్తోత్రము! వారికి వాక్యము చెప్పింది చాలా చాలా తక్కువ. అయితే ఆ గ్రామమంతటి

కొరకు ఈ రెండు సంవత్సరాలలో ఒక్కరోజయినా మర్చి పోకుండా సామ్యేలు ప్రార్థించాడు. ఆ ప్రార్థనకు జవాబు ఇప్పుడు కండ్లారా చూచాడు.

మరునాడు కల్వరి టెంపుల్‌కి ప్రార్ధనకి అంతా కలిసివెళ్ళారు. సామ్యేలు అల్లుడు – మామగారు! మీ చేత్తో ఓ బైబిలు తీసి ఇవ్వండి అన్నాడు. ఇంతకుముందు అల్లుడు వేరే కాంట్రాక్టరుతో కలిసి పనిచేస్తుండేవాడు. ఇప్పుడు సొంతంగా కన్స్ట్రక్షన్ పనులు చేస్తు, ఓ కారు కొన్నాడు.

అశోక్‌తో చెప్పాడు సామ్యేలు. రెండు పూర్తి బైబిలు చిన్న సైజువి అశోక్ ఇచ్చాడు. వాటి ఖరీదు చాలా ఎక్కువే!

సుధీర్ కూడ కల్వరి టెంపుల్‌కి వెళ్తుంటాడు. ఓ రోజు ఒంగోలు వచ్చాడు. దశమభాగము పదిహేనువందల రూపాయలు ఇచ్చాడు. అదేంటి వెయ్యిరూపాయలు కదా? అన్నాడు సామ్యేలు.

అంటే చాలాకాలంగా హృదయంలో ఓ వేదన ఉండేది. నేను చదివే రోజుల్లో యం.సి.ఎ. చదువుకు డబ్బులు లేవు. ఒక సంవత్సరం ఆగింది. నా తోటి వాళ్ళు ఇప్పుడు నాకు సీనియర్స్‌గా ఉన్నారు. ఈ విషయం నేను దేవునికి కూడా ఎన్నడు కంప్లెయింట్ చెయ్యలేదు. ఆయన తలచుకుంటే ఏదయినా చెయ్యగలడు. కాని ఎలా చేస్తాడో తెలియదుకదా! అనుకొనేవాడ్ని. మొన్న మా పై అధికారి ఆఫీసుకు వచ్చి మా అందరి పర్ఫార్మెన్సు చూసి నన్ను అందరికంటే ఉన్నత స్థానములో ఉంచుతూ నా జీతంకూడా పెంచాడు. అందుకని ఇంతకుముందు నాకు సీనియర్స్‌గా ఉన్నవారు ఇప్పుడు నాకు జూనియర్స్ అయ్యారు. అందువల్ల జీతం కూడా పెరిగింది అని సాక్ష్యము చెప్పి జీతంలో దశమ భాగము కంటె రెండురెట్లు ఎక్కువ చందాగా ఇచ్చి వెళ్ళాడు.

సామ్యేలుకు తన కడుపున బిడ్డలు ఉన్నారు, అల్లుళ్ళు ఉన్నారు. హైదరాబాద్‌లోనే ఉన్నారు. అయినా సామ్యేలుకు ఎవరూ ఏనాడు సహాయం చెయ్యలేదు. సామ్యేలు కోరలేదు. కానీ తన ఆత్మీయ కుమారుడైన సుధీర్ హైదరాబాద్‌లో సామ్యేలుకు అండ అయినాడు. సామ్యేలు రచనలు హైదరాబాద్‌లో బుక్‌షాపుల్లో వెయ్యడం, డబ్బులు వసూలు చేసి సామ్యేలుకు పంపడం. సామ్యేలు హైదరాబాద్ లో అడుగుపెట్టిన ఘడియ నుండి మరలా ఒంగోలు రైలు ఎక్కేవరకు సామ్యేలుతోనే ఉంటాడు. ఇప్పుడు అతను ఓ మంచి కంపెనీలో మంచి జీతానికి పనిచేస్తున్నాడు. దేవుని దీవెనలు ప్రార్థిస్తే రావు. మనము కలుగచేసుకొనిన సామర్థ్యమును బట్టి ఆయన తలాంతులను మనకు ఇస్తాడు. మనకు తక్కువ తలాంతులు ఇచ్చాడని దానిని మూటకట్టి దాచిపెడితే ఆయన వచ్చినప్పుడు చీకటికొట్లో పడవేయిస్తాడు.

సుధీర్ తన స్నేహితులను, కొందరు బంధువులైన యవ్వనస్తులను సామ్యేలుకు పరిచయము చేసాడు. వాళ్ళకి హన్నాకృప పత్రిక వెళ్తుంది. వారికి కూడా యేసుప్రభువును పరిచయము చేశాడు. ఒకసారి సుధీర్ స్నేహితులు ఇద్దరు సామ్యేలు ఆఫీసుకు వచ్చారు. వారిని యోగక్షేమాలు అడిగిన తర్వాత వారు వెళ్ళేటప్పుడు ప్రార్థన చేసేదా? అని అడిగాడు సామ్యేలు. వెంటనే వారిద్దరు నేల మోకరించారు. వారి హృదయాల్లో యేసుప్రభువు యెడల ఉన్న భావానికి సామ్యేలు ఆశ్చర్యపోయాడు.

కూకట్‌పల్లిలో ఇదే వయస్సున్న బాగా చదువుకొని ఉద్యోగాలు చేసే యవ్వనస్తులు చాలామంది ఉన్నారు. వాళ్ళు ప్రభువుకు సమర్పించుకొనినవారు. కల్వరి టెంపుల్‌కి ఎవరు వెళ్ళినా వారందరు వారిని ఆత్మీయులుగానే భావిస్తారు. పరిచర్య చేస్తారు. యవ్వనప్రాయంలో ప్రభువు అంగీకరించిన వారు వాడియైనబాణంతో సమానమని అప్పుడు గ్రహించాడు సామ్యేలు. వాక్యము బోధించేకంటే వాక్యమును నడవడిలో చూపించుట – పదిప్రసంగాలతో సమానము కదా!

**ప్రసంగములు పత్రికలో ప్రచురణ కొరకు పంపవద్దు**

# కీ॥శే॥ వై.యస్. చిన్నకొండా రెడ్డి గారు

**చిరస్మరణీయుడు!** (రెవ. బి. ప్రభాకరరెడ్డి, రాయలసీమ గాస్పెల్ మినిస్ట్రీస్ ట్రస్ట్ (రి), అనంతపురం గారి మాటలలో) :-

సన్మానపాత్రులు, పితృసమానులైన శ్రీ చిన్నకొండా రెడ్డి గారిని గూర్చి నా మనసులోని అభిప్రాయాన్ని తెలియ జేసే అవకాశాన్ని నాకిచ్చిన మా ప్రియమైన ప్రకాశ్‌రెడ్డి అన్నగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

సనాతన భారతీయ సాంప్రదాయ కుటుంబంలో జన్మించిన నేను, యవ్వన ప్రాయంలో, నిజదేవుడైన యేసు ప్రభుని స్వరక్షకునిగా అంగీకరించి, ఆ మహాదేవుని పిలుపును బట్టి ఆయన పవిత్రమైన పాదసేవకు అంకితం అయ్యాను. 25 సంవత్సరాల క్రితం యవ్వనస్తునిగా దేవుని పరిచర్య ప్రారంభించిన తొలిదినాలలో నన్ను అందరికంటే ఎక్కువగా ప్రేమించి, దేవుని సేవకై నన్ను అత్యంత అధికంగా ప్రోత్సహించినవారు శ్రీ వై.యస్. చిన్నకొండారెడ్డిగారు. తండ్రిలా ఆదరించి, వెన్నుతట్టి ప్రోత్సహించి, ఆత్మీయంగాను, ఆర్థికంగాను వారు చేసిన ఉపకారములను నేను ఎన్నటికీ మరువలేను.

నేను 1986,87,88,89 సంవత్సరములలో చిన్నకొండారెడ్డిగారితో కలిసి వారానికి ఒకసారి పులివెందుల పరిసర గ్రామాలకు వెళ్ళి సువార్త ప్రకటించేవారము. ఎక్కువగా మదూరు, బలపనూరు, బెస్తవారిపల్లె మరియు చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి సువార్త ప్రకటించేవారము.

ఆ దినాలలో పులివెందులలో నిర్వహించిన సువార్త సభలకు నన్ను అనేకసార్లు వాక్యోపదేశకునిగా చిన్నకొండా రెడ్డిగారు, పురుషోత్తమరెడ్డిగారు అహ్వానించారు.

నేను పులివెందుల వెళ్ళిన ప్రతిసారి కొండారెడ్డి గారి ఇంటికి వెళ్ళేవాడిని. ప్రతిసారి కొండారెడ్డిగారే ఇంటివద్ద ప్రేమతో భోజనం వడ్డించేవారు. వారు ఎంతో తగ్గించుకొని భోజనం వడ్డిస్తుంటే, సాక్షాత్తు యేసుప్రభువే భోజనం పెడుతున్న భావన నాకు కలిగేది. రాయలసీమలోని అన్ని జిల్లాలలో, అన్ని మండలాలలో, గ్రామాలలో సువార్త ప్రకటించాలన్న రాయలసీమ గాస్పల్ మినిస్ట్రీస్ దర్శనాన్ని అర్థం చేసుకొని నన్ను ఎంతో ప్రోత్సహించేవారు.

1987వ సంవత్సరంలో రాయలసీమ గాస్పల్ మినిస్ట్రీస్ ప్రథమ వార్షికోత్సవ మహాసభకు వారు ముఖ్య అతిథిగా విచ్చేసి వారి అమూల్య హస్తాల మీదుగా క్రీస్తు స్తుతి గీతావళి అనే క్రైస్తవ ఆధ్యాత్మిక గీతాలు అనే క్యాసెట్‌ను ఆవిష్కరించారు. వారితో మాకున్న అమూల్య అనుబంధాన్ని, వారి ద్వారా మేము పొందిన ఆధ్యాత్మిక దీవెనలను మాటల లో వివరించలేనివి, కలంతో వ్రాయలేనివి. వారు బైబిల్ గ్రంథంలోని క్రీస్తు ఉపదేశాన్ని సంపూర్ణంగా అనుసరించిన మహాభక్తుడని నేను మనసారా చెప్పుచున్నాను.

**ఒక్కమాట!** (ఆచార్య ఆర్.ఆర్.కె.మూర్తి, శుభవార్త వక్త, హైదరాబాద్ గారి మాటలలో) :-

సహోదరుడు వై.యస్.సి.కొండారెడ్డిగారిని నేను రెండుమూడుసార్లు కలుసుకున్నాను. వారి సాక్ష్యం విన్నాను. ఆయన్ను చూచాను. యేసుక్రీస్తును అంగీకరించడమే కాదు. యేసుకు నమ్మకమైన బలమైన సాక్షిగా జీవించిన ఉత్తమ క్రైస్తవుడు కొండారెడ్డిగారు. ఆయన సౌశీల్యం అందరిని ఆకర్షించింది. పులివెందుల ప్రాంతము ఆయన వ్యక్తిత్వ సౌరభవంతో పరిమళించింది.

స్వర్గీయ కొండారెడ్డిగారు క్రైస్తవ విశ్వాస పంథాలో తిన్నని మార్గంలో తన ప్రభువు అడుగుజాడల్లో నడిచారు (1913–1993). కొండారెడ్డి గారికి నా రేడియో ప్రసంగా లంటే ప్రాణం. ఆర్.ఆర్.కె. రచనలు అంటే నేను వ్రాసిన గ్రంథాలు ఆప్యాయంగా చదివేవారు. పులివెందులలో వారి స్వగృహంలో అతిథిగాయున్న జ్ఞాపకాలు నాకున్నాయి. సువార్తను హైందవ అగ్రవర్ణాల వారిక ఆకర్షణీయమైన విధానంలో చెబుతూ చూపడం వారి నైజమని నాకు తెలుసు. కీ॥శే॥ కొండారెడ్డిగారి కుటుంబాన్ని యేసుప్రభువు ఆశీర్వదించి సాక్ష్యార్థమై నిలువబెట్టిన విధానం అందరికి ఆమోద యోగ్యమైంది. దైవకృప, శాంతి. అపో.కా. 1:8

**క్రీస్తుతత్వం!** (వై. పాల్‌రెడ్డి, పులివెందుల గారి మాటలలో):-

ప్రభువునందు అత్యంత గౌరవనీయులైన ఆత్మీయ తండ్రి స్వర్గీయ శ్రీ వై.యస్. చిన్నకొండారెడ్డిగారిని గురించిన సంక్షిప్త సాక్ష్యము.

మస్తిష్కం మత్తేభానికి సంబంధము ఏమిటి? అన్నది లోక సామెత. ఆయనకు, నాకు పోలిక అలాంటిది. ఆయనతో నా సహవాసమును, ఆయనను గురించిన సాక్ష్యమును వ్రాయమని పెద్దలు పాస్టరు థియోఫిలస్‌గారు, శ్రీ వై.యస్. ప్రకాశ్‌రెడ్డిగారు కోరడం ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలిగించింది.

1980 నుండి ఆయన మరణదినం వరకు తండ్రి కొండారెడ్డి గారితో నాకు ఉన్న సాన్నిహిత్యము, ఆత్మీయ బాంధవ్యము మరువరానిది. వారితో నా సహవాసము, ఆత్మీయ బాంధవ్యము ఆవగింజలాగా కొద్దిపాటిగా ఆరంభమై, మరింతగా బలపడి, స్థిరపడి ఒకరిలో ఒకరంగా, ఒకరి ఆత్మీయతలో మరొకరం పరస్పరం ఆనందించ గలిగేంత వరకు సాగింది.

వయోబేధాన్ని మరిచి, అంతస్తు బేధాన్ని విడిచి, ఆత్మీయతను గుర్తించి, అభినందించి ఆశీర్వదించే ఉదాత్తమైన భావికుడు స్వర్గీయ శ్రీ వై.యస్.సి. కొండారెడ్డి గారు. అది వారిలోని క్రైస్తవ సుగుణానికి మచ్చుతునక. ప్రభువైన యేసుక్రీస్తు సుగుణాలైన ప్రేమ, దయ, జాలి, కరుణ, దీనత్వము, ఆప్యాయత, అనురాగములను నిండుగా పుణికి పుచ్చుకున్న భక్తుడు.

దైవవాక్యమును వినమ్రంగా పఠించి, సగౌరవము గా పాటించిన దీనుడు. పనిలో పటిష్టత, ఆర్జనలో సముపార్జనలో ఆలంబన కలిగి అలుపు సలుపు ఎరుగని కష్టజీవి. వయస్సు పైబడిన అలసట పైబడినా చేయితట్టి వెన్నుతట్టి అవసరాలలో ఉన్నవారిని ఆదుకున్న ఆప్తుడు. మేలును కీడును, లాభమును నష్టమును సమానముగా ఎంచిన దీర్ఘదర్శి. తంత్రాలు, మంత్రాలు, కుతంత్రాలు కాకుండా సత్యమే నిత్యమని, సత్యమే జయము అని నమ్మిన సిద్ధాంతకర్త, శ్రీమంతులు వారు.

చిన్నకొండారెడ్డిగారు నిజంగా చిన్న కొండారెడ్డి గారే! తన దగ్గరకు వచ్చిన చిన్న పిల్లలను చూచి పరలోక రాజ్యం ఈలాంటి వారిది, మార్పుపొంది బిడ్డలవంటి వారైతేగాని పరలోకరాజ్యము చేరలేరనే ప్రభువు మాట ఆయన జీవితంలో కనబడుతుంది. ఆయన ఎత్తైన మనిషి. అందుకోలేనంత ఉదాత్తమైన ఆత్మీయ విలువలు, మానవ ధర్మాలు, ఆదర్శభావాలు, పరలోకపు అంచుల వరకు ఎదిగిన ఆత్మీయత. ఆయన ధరించే తెల్లటి నూలు వస్త్రాలు ఆయన పవిత్ర జీవితానికి సంకేతాలు. తినేది తక్కువ – ఇతరులకు పెట్టేది ఎక్కువ. ఆయన చుట్టు ఉన్నవారి కడుపులు నిండిపోతే ఆయన కడుపు చల్లబడుతుంది. స్వధర్మం కన్న పరధర్మం పరమోన్నతంగా భావించిన ధర్మబద్ధులు స్వర్గీయ శ్రీ వై.యస్.సి. కొండారెడ్డిగారు.

ఆయన భక్తి విశ్వాసాలు ఆచరణాత్మకమైనవి. ఆదర్శప్రాయమైనవి, అనుసరణీయమైనవి. మనుష్యుల మెప్పును కోరక, యుక్తినికాక భక్తిని కోరి, శక్తిని పొంది ముక్తిని చేరిన వారు స్వర్గీయ శ్రీ వై.యస్.సి. కొండారెడ్డిగారు. సుఖ సౌఖ్యాలకు దూరంగా ఉండి సామాన్యజీవితాన్ని గడిపిన సౌమ్యుడు. కళంకములేని హృదయంతో, నిండైన మనస్సుతో ఆప్యాయతలను పంచి పెట్టిన ఆత్మీయుడు. ఆయన ఇంటా, బయటా అందరి మన్ననలు ప్రశంసలు అందుకున్న అభినందనీయుడు.

"పనియే ఆరాధన, ఆరాధనయే పని" అన్న సూక్తిని ఆచరణలో పెట్టి ఆదివారపు ఆరాధనలో తప్పక ఉండే ఆదర్శప్రాయుడు. కలిమిలేములు కష్టసుఖాలు, ఇరుకు ఇబ్బందులను ఆనందంతో ఆస్వాదించి అలరించిన ఆశావహులు. శ్రమను, శ్రమజీవులను గౌరవించి, వారి ప్రతి స్వేదబిందువుకు లెక్కగట్టి ప్రతిఫలం ఇచ్చే ఆసామి ఆయన. పుష్కలమైన దైవాశీస్సులతో పుష్పించిన పుత్ర సంతానం ఆయనది. తేనెవంటి మనస్సుతో మమతాను రాగాలను వెదజల్లుతున్న ఆడబిడ్డలు ఆయన గర్భసాఫల్యమే.

బలపనూరులో మామిడితోటలో శ్రీమతి రాజమ్మ గారితో ఆయనకు జరిగిన వివాహము మొదలుకొని ఆయన జీవితానుభవములన్నిటిని దాపరికం లేకుండా పూసగుచ్చి

**తరువాయిభాగం 23వ పేజీలో**

# హవీలా ప్రియదర్శిని

హవీలా అంటే ఏమిటి? అని ఆరో క్లాసులో ఆలోచించాను. మా టీచరుగారు అది ఆదికాండములో ఒకరి పేరు అన్నారు. మరొకాయన అది ఓ దేశముకానీ, ఫలాన చోటు అని నిర్దేశించి చెప్పలేము అన్నాడు.

ఏది ఏమయినా ఆ పేరు నాకు బాగానచ్చింది అని మా అమ్మతో అంటే 'ఆ పేరుకంటే నువ్వే బాగుంటా వమ్మా!' అన్నది. నాన్నతో చెబితే 'నువ్వు హవీలా పరిమళం' అన్నాడు. డ్యూటీనుండి వస్తే నాతోనే మాట్లాడుతుండేవాడు మా నాన్న.

మా అమ్మకి కొంచెం ఒంట్లో బాగుండడం లేదు. అమ్మ చిన్నతనంలోనే ప్రార్ధనచేయడం నేర్పించింది. అమ్మ ప్రార్ధన చేసుకొనేటప్పుడు నన్ను పిలిచి, ప్రార్ధన చెయ్యమని అడిగేది. ఎక్కువగా ఇతరుల కష్టాలు, బాధలు, అనారోగ్యం గురించి ప్రార్ధించేవారము. ప్రార్ధన చెయ్యడమంటే యేసయ్య తో సహవాసము చెయ్యడం అని చెప్పేది.

నా పందొమ్మిదో యేట అమ్మకు జబ్బు చేసింది. అమ్మ నేర్పించిన ప్రార్ధన ఎక్కువగా చేసేదానను. నాన్న కూడా చాల ప్రార్ధించాడు. సంఘము కూడా ప్రార్ధించారు. కాని ప్రభువు చిత్తము మరోలా ఉంది. అమ్మకు, నాకు ఉన్న బంధం చాలా బలమైనది. అమ్మని దేవుడు పిలిచాడు. నేను ఒంటరినయ్యాను. నాన్నను ఓదార్చే శక్తి నాకు లేదు. నాన్న చిల్లపిల్లాడిలా కనిపించేవాడు. ఆయనను ప్రభువే ఓదార్చాడు.

2004లో నాన్న ఉద్యోగం వదలి హైదరాబాద్ వచ్చాము. అమ్మకు నేను – నాకు అమ్మ. ఇలానే ఇంతకాలం గడిచింది. ఇప్పుడు అమ్మలేదు. కొత్త ఊరు. నాకు అమ్మ మీద ఎక్కువ దిగులుగా ఉండేది. ఓ రోజు మంచం మీద నుండి క్రిందకు దిగుదామనుకొంటే నా కాళ్ళు నా మాట వినలేదు. ముందు ఆశ్చర్యపోయాను. కాళ్ళలో శక్తిలేదు. ఎలాగో కష్టపడి మంచం దిగాను. ఆరోజు సాయంకాలానికి కాళ్ళు అసలు స్పర్శలేనట్లుగా ఉన్నాయి. మరునాటికి శరీరమంతా నా స్వాధీనములో లేదు. మద్రాసు తీసుకెళ్ళారు. తర్వాత ఎన్ని చోట్లో చూపించారు. మందులు వాడాను. నేను మంచానికే పరిమితమయ్యాను. నాన్న వీల్‌చైర్ తెచ్చారు. నాకు డైరీ రాయడం ఇష్టం. వ్రాయడం మొదలయి ఇప్పటికి ఆరు సంవత్సరాలైంది. అమ్మ ఎలాగు లేదు. నాన్న అయినా సంతోషంగా ఉండాలని అనుకొంటుండేదాన్ని.



నాకిలా అవడానికి కారణం ఏమిటి? అనుకొన్నాను. యోహాను సువార్త తొమ్మిదవ అధ్యాయము గుర్తుకు వచ్చింది. పుట్టు గ్రుడ్డివాడు అలా జన్మించడానికి ఎవడు పాపం చేశాడు. వీడా? వీని కన్నవారా? అని శిష్యులు యేసును అడిగారు. 'దేవుని క్రియలు వీనియందు ప్రత్యక్ష పరచబడుటకే వీడు ఈ విధముగా ఉన్నాడు' అని యేసు అన్నాడు.

మరి దేవుని చిత్తము నా విషయంలో ఏమిటి? అని ప్రార్ధించడం మొదలుపెట్టాను. అలా నాకొరకు మొదలైన నా ప్రార్ధన అనేకుల కొరకై సాగినది. ఎంత ప్రార్ధిస్తే అంత నెమ్మది, సంతోషాలు పొందాను. కనుక ప్రార్ధన అవసరాలు తెలిపిన వారందరి కొరకు ప్రార్ధించసాగాను.

యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్ సంఘకాపరి 'జాయ్ ఛెరియన్' అమ్మగారు నాకు పంపిన ఓ విలువైన తెల్లని టవల్ అంటే నాకు ఎంతో ఇష్టం. అది కప్పుకొని ప్రార్ధించే దానను. 'శాంతికిరణం' పత్రిక అయిదవ వార్షికోత్సవానికి నేను చక్రాల కుర్చీలో కూర్చుని వెళ్ళాను. జాయ్ ఛెరియన్ అమ్మగారు ప్రేమతో ఆశీర్వదించారు. అక్కడ "దీపిక" ఆంటీ నాతో చాలా ప్రేమగా మాట్లాడినది. ఆ దీపిక ఆంటీ కోసం చాలాసార్లు ప్రార్ధించి, నా ప్రార్ధనలో ఆంటీని గుర్తుచేసు కొనేదానను. మొన్న అంటే ఈ సంవత్సరమే జూన్ 22 ఉదయం మూడు గంటల ముప్పది నిమిషాలకు నాకు మగతగా ఉండినది. కండ్లు మూసుకొన్నాను. నేను నడుస్తూ

గెంతుతూ చక్కని పూలతోట వంటి ప్రదేశంలో ఆడుకొంటు న్నాను. ఇంట్లో చూస్తే నేను పండుకొని ఉన్నాను. నాన్న, మరికొందరు కండ్లవెంట నీరు కారుస్తున్నారు. నాకు అర్ధమయింది – నేను శరీరాన్ని వదిలి వచ్చానని. నా కొరకు పంపబడిన దూత నావైపు చూచాడు. ఏడుస్తున్న నాతండ్రి వైపు చూస్తే నా కండ్ల వెంబడి నీరు వస్తోంది. నా కండ్ల వెంబడి వస్తున్న నీటిని ఎవరో ప్రేమతో తుడిచివేశారు. అప్పుడు నాకు – దేవుడు తానే వారి దేవుడైయుండి వారికి తోడైయుండును. ఆయన వారి కన్నుల ప్రతి బాష్పబిందువు ను తుడిచివేయును అని నేను 'ప్రకటన' గ్రంధము నందు చదివిన మాట జ్ఞాపకము చేసుకున్నాను. నా రచనలు తృష్ణ – మిధ్య ఎవరో సర్దిపెడుతుంటే చూశాను. నా డైరీలు కూడా భద్రపరచారు అనుకుంటూ – ఇప్పుడు నేనెంత హాయిగా సంతోషంగా ఉన్నానో నా తండ్రికి ఎవరు చెబుతారు? అని అనుకొన్నాను.

✦ ✦ ✦

తర్వాత హవీలా కనిపించలేదు.

గుండాల విజయకుమార్‌గారి 'శాంతికిరణం' పత్రిక ద్వారా వారితో పరిచయము అయిన తర్వాత వారు నా రచనలు తెప్పించుకున్నారు. వారిని ఇప్పటికీ నేను చూడలేదు. నాకు అంతకుముందే పరిచయమైన విజయ కుమార్‌గారు వీరే అనుకొనేవాడిని.

'శాంతికిరణం' పత్రికలో హవీలా పరిమళం మహిమలోకి ప్రవేశించినదని తెలుసుకొని చాలా విచారిం చాను. నాలుగురోజులు హవీలా గురించి ఆలోచిస్తూ పెన్ను తీసుకొని వ్రాయడం ప్రారంభించాను. కాని నేనే హవీలా వద్దకు వెళ్ళాను. హవీలా దేవదూతవలె ఉన్నది. ఆమెను చూడడానికి రెండు కండ్లు చాలనంతగా వెలుగులో ఉన్నది. ఆమెవలె కొందరు దేవుని సేవకులవలె కనిపించారు.

'హవీలా! రా! ఇలా కూర్చో! అని, నా పాఠకులకు నీ గురించి చెప్పాలని ఉంది' అన్నాను. ఇప్పుడు మేమిద్దరమే అక్కడ ఉన్నాము. హవీలా మాటలాడ నారంభించింది. హవీలా ఇంత హాయిగా ఉందని తెలిస్తే అందరికి సంతోషమే గదా!

**– కొడవటికంటి –**

**21వ పేజి తరువాయి భాగం**

నట్టు నాకు చెప్పిన విషయాలను అనేక ఘట్టాలుగా చెప్పుకో వచ్చు. అయినా వాటిని ఇక్కడ ప్రస్తావించలేను.

కుటుంబ సభ్యుల భక్తి విశ్వాసాల నిమిత్తమై పరితపించిన ప్రార్ధనాపరుడు. జీవితాంతము తన కొరకు, తన కుటుంబము కొరకు పాటుపడి ప్రభువు కొరకు ఏమి చేయలేదనే జీవిత సత్యాన్ని గ్రహించిన అంతర్ముఖుడు స్వర్గీయ శ్రీ వై.యస్.సి. కొండారెడ్డిగారు. అంతర్ముఖుడై మానవసేవను దైవసేవగా భావించి, కార్యోన్ముఖుడై ప్రజలకు చేయూత నివ్వడానికి తనకు సంక్రమించిన జ్యేష్టత్వపు భాగమును వ్యయపరచిన ధన్యజీవి ఆయన.

పరలోకంలో ఫలంకొరకు నిరీక్షణ కలవారుగా సువార్తను ప్రకటించాలన్న ప్రభువాజ్ఞను శిరసావహించి అంకుఠిత దీక్షతో శరీరములో శక్తి లేకపోయినా సొంత కారులో సహకారులను వెంటబెట్టుకొని సొంత గ్రామాలలో సువార్తను, ప్రభు రక్షణమార్గమును ప్రకటించిన సువార్తికుడు. ఘనమైన ప్రభు సువార్తను గణనీయంగా ప్రకటించుట కొరకు తన జ్యేష్టత్వపు భాగమును ధారాళముగా అందించిన దాతృత్వం ఆయనది. అనాధలను గురించి ఆలోచించే ఆయనకు, సహకారులు అందుబాటులో లేక ఎందరినో కోరినా, కొందరైన ముందుకు రాకపోవడంతో ఆయన ఆశ, ఆశయాలకు గండిపడింది. అనాధలకు ఆపన్నహస్తం అందించాలన్న తపన గల బాంధవుడు. వారి కోరిక తీరకనే ఆయన ఆత్మ ప్రభువు చెంతకు చేరింది. ఈ విషయమై ఆయన నన్ను ఎంతగానో ప్రేరేపించారు. కాని అప్పట్లో ఆయన ప్రతిపాదనకు నేను సిద్ధపడలేదు. ఆనాటి ఆయన స్ఫూర్తియే ఇప్పుడు మేము నిర్వహిస్తున్న వృద్ధాశ్రమానికి కారకం, ప్రేరకం.

వారి బంధువులకు నన్ను బంధువుగా పరిచయం చేసేవాడు. నేనెలా బంధువునో చెప్పలేకపోయేవాడిని, అది వారిలోని గొప్పతనం. అది ఆత్మీయతత్వం, క్రీస్తుతత్వం కనుకనే వారు నాకు మార్గదర్శకం.

# ఆలేషా - కుండ

– లియోటాల్‌స్టాయ్

ఆలేషా అందరిలో చిన్నవాడు. ఆలేషా అంటే కుండ అని అతనిని ఎందుకు పిలుస్తారు?

ఒకసారి వాళ్ళ అమ్మ ఓ కుండను చర్చిలో పనిచేసే ఒకతనికి ఇచ్చి రమ్మంది. అయితే ఆలేషా ఆడుకుంటూ వెళుతూ దారిలో కుండను పగులగొట్టాడు. అప్పుడు వాళ్ళ అమ్మ బాగా కొట్టింది. ఆ రోజునుండి తోటిపిల్లలు ఆలేషా అనకుండా 'కుండ' అని పిలువసాగారు. ఆలేషా సన్నగా పలచగా, దిబ్బముక్కు, విసనకర్ర లాంటి చెవులు – అతని ముక్కును చూస్తే కొండమీద కూర్చున్న కుక్కలాగా అనిపిస్తుం దని పిల్లలు ఏడిపించేవారు. అతను బడికి వెళ్ళేవాడు కాని చదువు అతనికి గిట్టలేదు. అంతేకాక ఇంట్లో అతను చాలాపనులు చేయవలసి ఉన్నందున చదువుకోవడానికి సమయం ఉండేదికాదు. అతని అన్న పట్టణంలో ఓ వ్యాపారి వద్ద పనికి కుదిరినందువలన ఆలేషా చాలా చిన్న వయసు నుండి తన తండ్రికి సహాయపడుతుండేవాడు.

అతను ఆరు సంవత్సరాల వయస్సప్పుడే ఆడ పిల్లలతో గడ్డి బీటెలో ఉన్న ఆవులను, గొఱ్ఱెలను గమనించి చూస్తుండేవాడు. కొంచెం పెద్ద అయిన తర్వాత రాత్రింబవళ్ళు గుఱ్ఱాలను చూస్తుండేవాడు. అతనికి పన్నెండేళ్ళు వచ్చేసరికి నాగలి పట్టడం, బండి నడపడం నేర్చుకున్నాడు. అతని దగ్గర నేర్పు ఉన్నది. కానీ తగిన శక్తి అతని నేర్పుకు సహాయ పడలేదు. తోటి పిల్లలు అతనిని ఎగతాళి చేస్తే వారిని చూసి నవ్వేవాడు లేకపోతే మౌనంగా నిలుచుండేవాడు. వాళ్ళ నాన్న ఎప్పుడయినా బాగా తిడుతుంటే కర్రలాగా నిలబడిపోయి ఆయన తిట్లు వింటుంటేవాడు. ఆయన తిట్టడం ఆగినప్పుడు ఓ నవ్వు నవ్వి మరలా పనిలో దిగేవాడు.

అతనికి పందొమ్మిది సంవత్సరాల వయసు వచ్చినప్పుడు వాళ్ళ అన్నను సైన్యంలోకి తీసుకున్నారు. అప్పుడు అతని తండ్రి అతనిని పట్టణం వ్యాపారస్తుని దగ్గరకు తీసుకొనివెళ్ళి సామాను మోసే పనిలో పెట్టాడు. అతనికి వాళ్ళ అన్న ధరించిన పాత బూట్లు ఇచ్చారు. అతని తండ్రి వేసుకొనే పాతకోటు, తలమీదకు ఓ టోపీ ఇచ్చి, అతనిని పట్టణం తీసుకొని వెళ్ళారు. దుస్తులు, బూట్లు, టోపీ ధరించి ఆలేషా చాలా సంతోషించాడు. కాని ఆ వ్యాపారికి ఆలేషా నచ్చలేదు.

నువ్వు అతని అన్నకు మారుగా మంచి కుర్రాడ్ని తెస్తావనుకున్నాను. కాని ఇతనిని తెచ్చావు. ఇతను ఇక్కడ ఎలా పనికి వస్తాడనుకున్నావు? అన్నాడు ఆ వ్యాపారి.

ఇతను అన్ని పనులు బాగా చేస్తాడు. గుఱ్ఱాలను చూస్తాడు. బండి కూడా నడుపుతాడు అన్నాడు తండ్రి.

అలాగా! అయితే అతను ఎలా పనిచేస్తాడో చూద్దాం అన్నాడు వ్యాపారి. కుటుంబము చిన్నదే! అతని భార్య, అతని తల్లి, పెండ్లయిన కుమారుడు ఉన్నాడు. అతను అంతగా చదువుకోలేదు. తన తండ్రి వ్యాపారం చూసేవాడు. మరొక కొడుకు హైస్కూలు వరకు చదివాడు. కాలేజిలో చేరాడు. కాని అక్కడనుండి అతనిని తొలగించారు. అందువల్ల ఇంట్లోనే ఉంటాడు. ఒక కుమార్తె ఉన్నది. బడికి వెళ్తున్నది. మొదట్లో వీళ్ళందరికి ఆలేషా అంటే ఇష్టపడ లేదు. కాని అతని బాగా ఉపయోగించుకోవడం నేర్చు కొన్నారు. అతని అన్నకంటే బాగా పనిచేస్తున్నాడు అను కున్నారు. అతను అలుపులేకుండా వారు చెప్పిన పనులన్నీ త్వరగా ముగించేవాడు. అందువలన అన్ని పనులు అతనే చేయవలసి వచ్చింది. ఇంటివారే కాక ఇంట్లో పనిచేసేవారు కూడా ఆలేషాకి పనులు చెబుతుండేవారు.

ఆలేషా పాతబూట్లు చినిగిపోయి సగం పాదం బయటవుండేది. ఓ రోజు వ్యాపారి చూసి కొత్త బూట్లు తెప్పించాడు. ఆలేషా చాలా సంతోషించాడు. కాని తన తండ్రి జీతం కొరకు వచ్చినప్పుడు ఈ డబ్బులు తగ్గించి ఇస్తే తండ్రి కోపపడతాడని భయపడ్డాడు. అనేకరకమైన పనులు చేస్తూ భోజనమునకు ఆలస్యం అయితే వంటమనిషి తగవులాడేది.

పండుగలు వస్తే ఇంట్లోవాళ్ళు ఏదైనా కొంతడబ్బు

ఆలేషాకి ఇచ్చేవారు. వాటితో ఓ చక్కని ఎర్రకోటు కొనుక్కు న్నాడు. అది చాలా అందంగా ఉన్నది.

అలేషాకి ప్రార్థన చెయ్యడం తెలియదు. వాళ్ళ అమ్మ చిన్నప్పుడు నేర్పించిన ప్రార్థన మరచిపోయాడు. అయినా ప్రతి రోజు ఉదయం, సాయంకాలం ప్రార్థన చేసుకునేవాడు. చేతులు పట్టుకొని మోకరించి ప్రార్థించేవాడు.

ఇలా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అప్పుడు ఓ సంఘటన అతని హృదయాన్ని కదిలించింది. అదేమంటే ఇంట్లో అందరూ అన్నిపనులూ అతనితో చేయించుకోవడానికి పిలుస్తుండేవారు. కానీ ఆ ఇంట్లో ఒకే ఒక వ్యక్తి తనను అభిమానిస్తుంది అని తెలుసుకున్నాడు. ఆమె ఉస్టీనియ! ఇంటి వంటమనిషి. ఆమె యవ్వనస్తురాలు. తల్లిదండ్రులు లేని అనాథ. అలేషా వలెనే ఇంట్లో కష్టపడి పనిచేసేది. తన అవసరాలు ఏవో గమనించి సహాయ పడుతుందని తెలుసుకున్నాడు. తన కష్టాలు చూసి కన్నతల్లి బాధపడేది. అది సహజమే కదా అనుకునేవాడు. కానీ ఉస్టీనియ పూర్తిగా తనకు సంబంధములేని అమ్మాయి. తన కొరకై బాధపడడం అతనికి క్రొత్తగా అనిపించింది. ఆలేషాకి ఆమె ఏదైనా పెడితే తింటుంటే ఆలేషాని చూస్తువుండేది. ఆమెను చూసి ఆలేషా నవ్వితే ఆమె కూడా నవ్వేది సిగ్గుపడుతూ. ఉస్టీనియ పేరు తలుచుకుంటేనే ఆలేషా హృదయము హాయిగా ఉండేది. ఉస్టీనియ అతని గుడ్డలు చినిగినప్పుడు కుట్టేది. ఆహారం దాచిపెట్టి పెట్టేది. ఒక్కోసారి ఉస్టీనియ ఆలోచనలు తన పనికి అంతరాయం కలిగిస్తా యేమోనని భయపడేవాడు.

ఉస్టీనియతో కలసి చాలాపనులు చేస్తుండేవాడు. ఉస్టీనియ తన సంగతంతా చెప్పేది. ఆలేషా వినేవాడు. తన తండ్రి, తల్లి చనిపోతే తన అత్త ఇక్కడికి తీసుకొని వచ్చింది. ఉస్టీనియ జీతం అత్త తీసుకొనిపోతుంది.

ఇంటి యజమాని కొడుకు ఒకటి రెండుసార్లు తనతో చనువుగా ప్రవర్తిస్తే తను ఎలా అతనిని ఆపిందో చెప్పింది. సాధారణంగా పట్నంలో పనిచేసేవారు ఇంటి పనులు చేసే అమ్మాయిలను పెండ్లి చేసుకుంటారని చెప్పింది. మీ తల్లిదండ్రులు నీకు పెండ్లి చెయ్యరా? అని అడిగింది. అయితే ఆలేషా నేను పల్లెటూరి అమ్మాయిని పెండ్లి చేసుకోను అని చెప్పాడు.

ఎందుకు అలా అన్నావు? అన్నది.

నేను నిన్ను పెండ్లి చేసుకుంటాను, నీకిష్టమేనా? అన్నాడు.

నీతోనా? పెండ్లా? ఆలేషా – కుండ అని తన చేతిలో ఉన్న గుడ్డతో నవ్వుతూ 'కొట్టి' అవును నిన్నెందుకు చేసుకోకూడదు? అన్నది.

ఒకరోజు అతని తండ్రి వచ్చాడు. ఇంటి యజమానురాలు ఉస్టీనియకి పెండ్లి చెయ్యడం ఇష్టంలేదు. రేపు పిల్లతల్లి అయితే ఉస్టీనియతో మనకేమిపని? అన్నది.

వ్యాపారి ఆలేషా తండ్రికి జీతం డబ్బులు ఇచ్చాడు. అబ్బాయి ఎలా ఉన్నాడు? అని యజమానిని అడిగాడు.

అంతా బాగానే ఉన్నది, కానీ ఈమధ్య అతను మా వంటమనిషితో చనువుగా ఉండి ఆమెను పెండ్లి చేసుకోవాలనుకుంటున్నాడు. మాకు ఇష్టంలేదు. పెండ్లయిన పనివారితో మాకేంటి? నేను సమ్మతించను అన్నాడు.

మీరు ఆ విషయం వదిలేయండి. నేను చూసు కుంటాను అన్నాడు తండ్రి.

వంటగదికి వెళ్ళి నీవెందుకు ఇలా చేస్తున్నావు? నీ పెండ్లి విషయం ఇంకా సమయం ఉంది. సమయము వచ్చినప్పుడు ఓ మంచి అమ్మాయిని చూసి పెండ్లి చేస్తాను కాని, ఇలా ఇండ్లలో పనిచేసే అమ్మాయిని కాదు అన్నాడు. ఆయన ఇంకా చాలా చెప్పాడు. స్థంభంలాగా నిలబడి అంతా విన్నాడు. ఆయన వెళ్ళిపోతుంటే – సరే! ఆ విషయం వదిలేస్తాను అన్నాడు. తండ్రి వెళ్ళిపోయిన తర్వాత ఉస్టీనియతో అంతా విన్నావుకదా! ఇక లాభంలేదు, అంతే! అన్నాడు. ఉస్టీనియ చాలా ఏడ్చింది.

ఆలేషా నిట్టూర్చాడు. అంతే వాళ్ళు ఎలా చెబితే అలా చెయ్యాల్సిందేగా! అన్నాడు. ఓ సాయంకాలము తలుపులు వేస్తుంటే యజమానురాలు వచ్చింది. నీ ఆలోచనలు ఆగిపోయాయా? మీ తండ్రి చెప్పినట్లుగా వినాలనుకొంటున్నావా? అన్నది.

ఓ తప్పకుండా ఆయన చెప్పినట్లే చేస్తాను అని

నవ్వి ప్రక్కకి వెళ్ళి చాలాసేపు ఏడ్చాడు.

అప్పటినుండి ఆలేషా ఉస్టీనియతో మాట్లాడడం మానివేశాడు. తన పనులేవో అవి చూసుకుంటు వుండేవాడు.

ఒకరోజు ఇంటిమీదకు ఎక్కి అక్కడ పేరుకు పోయిన మంచునంతా క్రిందికి నెట్టి వేస్తున్నాడు. చివరిలో అతని కాలుజారి ఇంటిమీదనుండి క్రిందపడ్డాడు. అతను మంచు మీద పడలేదు కాని తలుపుకు ఉన్న ఓ ఇనుపమేకు మీద పడ్డాడు. ఉస్టీనియ పరుగెత్తుతూ వచ్చింది. ఆమెతో ఇంటి అమ్మాయి కూడా వచ్చింది.

నీకు దెబ్బ తగిలిందా ఆలేషా? అన్నది ఉస్టీనియ.

అబ్బే ఏమీ తగులలేదు. ఇదెంత? అని నవ్వుతూ పైకి లేవబోయాడు. అతనిని ఆస్పత్రికి తీసుకొనివెళ్ళారు. డాక్టరు వచ్చి నీకు ఎక్కడ ఎక్కువ నొప్పిగా ఉన్నది? అన్నాడు.

నా శరీరం అంతా నొప్పిగానే ఉన్నది అని నవ్వుతూ – మా యజమానికి పనులు ఆగిపోతాయి. ఆయన బాధపడతారు. మా తండ్రి కోప్పడతారు అన్నాడు.

ఆలేషా రెండురోజులు మంచంమీద ఉన్నాడు. మూడవరోజు పాస్టరు కొరకు కబురుచేశారు.

నీవు నిజంగా చనిపోతావా? అన్నది ఉస్టీనియ.

అవును, అంతే అనిపిస్తోంది ఉస్టీనియా! ఎవరైనా పోవలసినదే కదా! అయినా నీకు నేను చాలా కృతజ్ఞుడను. నీవు నా యెడల సంతోషంగాను, ప్రేమగాను ఉన్నావు. మన పెండ్లికి ఒప్పుకోకపోవడం మంచిదయింది. అదే జరిగితే మనం ఎక్కడ ఉండేవాళ్ళము. మనం పెండ్లి చేసుకోకపోవడం మంచిదే! ఇప్పుడు ఉన్నట్లే ఉండాలి అన్నాడు. పాస్టరు వచ్చాడు. ఆయన చేతులు ఆలేషా గుండెమీద పెట్టి ప్రార్థించి ఇది మంచిదే నీవు అందరికీ సహాయం చేసి ఎవరిని నొప్పించకుండా బ్రతికావు అన్నాడు.

ఆలేషా కొద్దిగానే మాట్లాడాడు. నాకు దప్పిక అవుతుంది అని చెప్పాడు. దేని విషయమో అతను ఆశ్చర్య పోతున్నట్లు కనిపించాడు. అలానే ఆశ్చర్యమైన సంగతులు చూస్తున్నట్లుగా ఉన్నాడు. తర్వాత అటుప్రక్కగా తిరిగి చనిపోయాడు.

# ఉత్తరాలు

గౌరవనీయులైన సామ్యేల్ రాజేంద్రగారికి,

తమరి క్షేమం కొరకు, పత్రిక నడిపింపుకొరకు సదా ప్రభువును ప్రార్థించుచున్నాను. తమరు పంపించిన పుస్తకముల కోసం వందనములు. ఆసెనతు పుస్తకం చదివి ప్రక్కన అమ్మాయి సరితాను ఆసెనతు! అని మూడుసార్లు పిలిచాను. మనసులో, కళ్ళలో ఉండిపోయింది. ఆక్షాపుగారు ఖైదీల గది యొద్ద చేతిలో ఒక పాత్ర, ఒక గుంట గరిటె పట్టుకొని నిల్చున్నారు. యేసు ప్రభువు ఫోటోలాగా మెడపై వెంట్రుకలు – చాలా చక్కగా వున్నారు. అర గజం పొడవు వెడల్పు గలిగిన నిండు వైలెట్ కలర్ ఫోటోలో కనిపిస్తున్నారు. క్రింద కాళ్ళ దగ్గర ఎవరో కూర్చుని వున్నారు, తల వంచుకొని. యోసేపు అనుకున్నాను. ఈ కల మాటిమాటికి గుర్తు చేసుకుంటున్నాను. అయ్యా! తమరు చేయుచున్న పత్రిక నిమిత్తము చాలామంది వేలలో ఇస్తున్నారు. పత్రికలో చూస్తున్నాను. నేను అంత ఇవ్వలేక పోతున్నాను. ఈ నెలలో కూడా పంపుతాను. ప్రభువు మీ పరిచర్యను దీవించును గాక! వందనములతో,

**సి. హెచ్. కనికరమ్మ, కోలవెన్ను**

✦ ✦ ✦

ప్రభువు నందు ప్రియమైన సామ్యేల్‌రాజేంద్ర గారికి నా హృదయపూర్వక వందనాలు. మీ స్వచ్ఛందసేవను బట్టి నేనానందించుచున్నాను. మీరచనా చాతుర్యమెంతో గణనీయము నైయున్నది. మీరు గడించిన పూర్వ దైవసేవకుకు జీవితాల ద్వారా నాలాంటి మూఢులు మార్పుచెందుటకు మార్గదర్శకులు గా ఉన్నాయి. నేను ఎల్లప్పుడు దైవసన్నిధిలో ప్రార్థించువాడను. నాకు ఊహ తెలిసిన నాటినుండి నేను ప్రభువును కోరునది జ్ఞానం. అదియు పారమార్థిక సంబంధమైనది. శరీరాశలకు నేనెన్నడు చోటివ్వలేదు. ఆ దేవాది దేవునిపై ఆధారపడినవాడను. నాకు తొంభై సంవత్సరాలు. అన్నియు నన్ను విడుచువేళాయెను గనుక మానసికముగా బలహీనుడనై దుఃఖక్రాంతుడనై కన్నీరు కార్చుచు దినమెల్ల నా చేతనైనట్లు ప్రభువును ఘనపరుస్తూ యుండుటయే నా పని. గనుక నేను దృష్టికలిగి మంచిమనస్సుతో వ్రాయులేఖ కాదిది. వ్రాయ తలంపు కలిగి వ్రాస్తున్నదని నా వ్రాతబట్టి గ్రహించగలరని భావించుచున్నాను. ప్రభువు నా దుఃఖకారణమైన వాటిని దూరపర్చి మంచిమనస్సు దయచేయ ప్రార్థన. తప్పక ప్రార్థించండి, మరువవద్దు.

**యం. ఆశీర్వాదం,15వ వార్డు, రేపల్లె**

సాక్ష్యము

# నా జీవితములో ప్రభువు హస్తం

శ్రీమతి మేరి కమల

నా జీవితములో ప్రభువు పరమునుండి పంపిన ప్రతి ఆశీర్వాదమునకు మరి ముఖ్యముగా దీనత్వము, మంచి తనము కలిగిన తల్లిదండ్రులను నాకిచ్చినందుకు దేవునికి, కృతజ్ఞతలు చెల్లిస్తున్నాను.

ఆంధ్రప్రదేశ్‌లోని ఓ చిన్న గ్రామములో నాతండ్రి ఓ చిన్న చర్చికి ప్రీస్టుగా పనిచేస్తుండేవారు. అక్కడనుండి దేవపూడి అనబడే ఓ మారు మూల ప్రాంతమునకు ఆయనను బదిలీ చేశారు. అక్కడ నివశిస్తూనే చుట్టుప్రక్కల ఓ నలభై కుగ్రామాలను ఆయన చూడాలి. ఆ రోజుల్లో ప్రయాణ సాధనములు లేవు. అందువలన ఆయన రానుపోను నడుస్తుండేవాడు. మా తండ్రిగారికి దేవుడు స్వస్థతావరము ఇచ్చి ఆశీర్వదించాడు. అక్కడ కొద్దిమంది క్రైస్తవులు మాత్రమే ఉన్నారు. ఒకరోజున కలరాతో బాధపడుతున్న ఓ రోగిని ఆయన దగ్గరకు తీసుకొనివచ్చారు. అప్పటికి చాలామంది ఆ జబ్బువలన మరణించారు. మాతండ్రి పాస్టరు కనుక చనిపోయిన వారి బంధువులతో పాటుగా భూస్థాపిత కార్యక్రమమునకు వెళ్ళవలసి వచ్చేది. రోగులకు అవసరమయిన 'జావ'ను కాచి కిటికీ గుండా బయట రోగులకు పంపించు కాని నువ్వు, పిల్లలు బయటకు రావద్దని మా అమ్మకి చెప్పాడు. మా తండ్రిగారి దగ్గర కొన్ని ఆయుర్వేద మందులు ఉండేవి. అవి రోగులకు వాడేవాడు. కొన్ని రోజులకు ఆ వ్యాధి తగ్గిపోయింది. మా సంఘములోని స్త్రీలకు మా తల్లిగారు మంచి చెడ్డలను చూసేవారు. సంఘములోని స్త్రీలకు ఆమె పాటలు పాడడం, వాక్యం చదవటం నేర్పించేది. సంఘములో జరిగే కార్యక్రమాలన్ని అక్కడికి వచ్చే మిషనరీలకు చూపించుటకు సిద్ధపడి ఉండమని కబురు వచ్చింది. సంఘములో చదువు కొనిన స్త్రీలు ఒక్కరయినా లేరు. మా అమ్మ అక్కడి స్త్రీలకు ఓ క్రిస్మస్ నాటికను నేర్పిస్తున్నారు. అదేమిటంటే అబ్రాహాము తన ఇంటి ముఖ్య దాసుని – దూరంలో ఉన్న తన బంధువుల నుండి తన కుమారుడైన ఇస్సాకును, భార్యను తీసుకొని వచ్చే సంగతి. మా అమ్మ ఆ స్త్రీలు ఏ పాత్రలో నటించాలో నేర్పిస్తున్నది. మిషనరీలు వచ్చి ఆమె పనిని చూపించమన్నారు. నాటికను చూసిన మిషనరీలు ఆశ్చర్యంగాను ఆనందంగాను ఉండి నాటికలో నటించిన వారందరికి బహుమానములు ఇచ్చారు.

నా తండ్రి నన్ను ఓ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాడు. ఇంతలో మా తండ్రిని బదిలిచేశారు. అందువలన నా పెద్దక్క చదువుతున్న "బిషప్ అజరయ్యా బాలికోన్నత పాఠశాలలో నన్ను కూడా చేర్చారు. నేను యస్.యస్.ఎల్.సి. వరకు అక్కడే చదివాను. తరువాత గుంటూరులోని ఆంధ్ర క్రైస్తవ కాలేజిలో చేరి బి.యస్.సి. పాసయ్యాను. తర్వాత కేథలిక్ కాలేజిలో చేరి బి.ఇ.డి. చదివాను. తర్వాత ఉపాధ్యాయ ఉద్యోగానికి దరఖాస్తు చేశాను. దేవుని కృపవలన నేను ఎక్కడ విద్యనభ్యసించానో ఆ పాఠశాలలోనే ఉద్యోగం వచ్చింది.

అప్పుడు గుంటూరు వాస్తవ్యులు స్వర్గీయ లూథర్ బెన్నిసన్‌గారి నాల్గవ కుమారుడు శ్రీ చేగొడి లయోల హ్యారి బెన్నిసన్ గారితో నా వివాహము జరిగినది. తర్వాత కర్ణాటక లోని బళ్ళారిలో మేము కుటుంబము ప్రారంభించాము. వెంటనే నాకు ఉద్యోగము లభించలేదు. కొంతకాలం గడచిన తర్వాత క్రొత్తగా ప్రారంభించిన ఓ కేథలిక్ స్కూలులో సైన్స్ టీచర్‌గా ఉద్యోగములో చేరాను. అక్కడివారంతా నా పనితీరు చూసి సంతోషించారు. అనుకోకుండా నా భర్తకు ఉద్యోగ బదిలి చాలాదూర ప్రాంతములో జరిగినది. నా అత్తగారితో నేనొక్కదానినే ఉండవలసి వచ్చింది. ఆమె అధిక రక్తపోటు, షుగర్ వ్యాధితో బాధపడుచుండినది. ఆ ప్రాంతము నాకు క్రొత్తదయినందువల్ల నాకు ఎక్కవ మందితో పరిచయము లేదు. హాస్పిటల్స్ కూడా తెలియవు. ఒకరోజు మా అత్తగారికి సుస్తి చేసినది. దేవుడు నా భర్త యొక్క స్నేహితుని మా ఇంటికి పంపించి, హాస్పిటల్‌కు తీసుకొని వెళ్ళాము. అప్పుడు ఆమె అనారోగ్యము బయలుపరచబడింది. నేను వెంటనే నా భర్తకు ఈ సమాచారము అందించాను. ఆయన తన పెద్ద అన్నకు, తన ఏకైక సహోదరి ఫ్లారెన్సు ఫ్లావియా

(యెదుగురి సందింటి డా॥ పురుషోత్తమ రెడ్డిగారి భార్యకు, వారిద్దరు డాక్టర్లే!)కు తెలియజేశారు. నేను ఒంటరిగా మా అత్తగారికి పరిచర్య చేయ కష్టముగా ఉన్నందున బళ్ళారికి వెళ్ళాము అన్నాను. కాని నా భర్త ఉద్యోగం చేస్తున్న చోటున ఆయన కొద్ది నెలల క్రితమే చార్జి తీసుకొనినందున ఆయనకు సెలవు దొరకలేదు.

ప్రతి గవర్నమెంటు ఉద్యోగి భార్యాభర్తలు ఒకే చోట జీవించే విధముగా జరగాలన్న ఓ గవర్నమెంటు ఆర్డరు ఉందన్న సంగతి ప్రభువు తెలియజేశాడు. అందువలన ఇప్పుడు నేను పనిచేస్తున్నది గవర్నమెంటు స్కూలు కాదు గనుక ఆ ఉద్యోగము వదిలి తాత్కాలిక ఖాళీ ఏర్పడిన ఓ గవర్నమెంటు బాలికల పాఠశాలలో చేరాను. కాని కేథలిక్ స్కూలు వారు దానికి ఒప్పక నేను రాసిన రాజీనామాను అంగీకరించక అడ్డుపెట్టారు. నా పై అధికారి 'గులబర్గా'కు వెళ్ళి పై అధికారులతో రెండుసార్లు అడ్డు చెప్పి గవర్నమెంటు స్కూలులోని నా ఉద్యోగము నుండి తొలగించబోయేలోపల నా భర్త బళ్ళారి వచ్చారు. దేవునికి స్తోత్రము!

అధికారుల అలసత్వము వలన నేను విసుకుచెంది అలసిపోయాను. అయితే నా దేవుడు సర్వోన్నతుడు సర్వశక్తిమంతుడు. మరొక తాత్కాలిక ఖాళీ గవర్నమెంటు స్కూలులో ఏర్పడినది. అందులో చేరాలని నేను ప్రయత్ని స్తుంటే మరొక స్త్రీ కూడా అందులో ప్రవేశించాలని ప్రయత్ని స్తున్నట్లు తెలుసుకున్నాను. ఈ లోపల నన్ను 'హోస్పేట'లోని బాలికల పాఠశాలకు బదిలీ చేశారు. ఆ స్కూలులో కన్నడ మాత్రమే ఉపయోగించబడుతుంది. నాకు కన్నడ తెలియదు. ఆ ఖాళీలో పనిచేయుటకు మరొకరు ప్రయత్నిస్తున్నారని తెలిసింది. డిప్యూటి డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ ఇన్‌స్ట్రక్షన్ అధికారులు ఆ పట్టణంలో ఉన్నారని వారికి తెలుసును. నాకు పోటీగా వచ్చినవారు గవర్నమెంటు నుండి అధికారము ఉపయో గించాలని చూస్తున్నారు. నేను, నా భర్త ఈ విషయంలో బహుగా ప్రార్థించనారంభించాము. ఒకరోజు నేను నా భర్త డి.డి.పి.ఐ. ని చూడాలని గెస్ట్ హౌస్‌కి వెళ్ళాము. మేము బయట కూర్చున్నాము. ఎవరో ఓ లేడి లోపలనుండి బయటకు వచ్చి, మీరెవరు? ఎందుకు కూర్చున్నారు? అని అడిగారు. అప్పుడు సమయము మధ్యాహ్నం మూడు గంటలయింది. మేము డి.డి.పి.ఐ. గారిని చూడాలని వచ్చాము అని చెప్పాము. ఆమె కారణమేమి? అన్నది. అప్పుడు మేము జరిగిన సంఘటనంతా ఆమెకు వివరించాము. ఆమె ఎవరో మాకు తెలియదు. మాకు కన్నడరాదు, కాని హోస్పేట మార్చారు అని చెప్పాము. ఆమె వెంటనే తన పర్సనల్ సెక్రెటరీని పిలిచి నన్ను ఖాళీ ఏర్పడిన బళ్ళారి హైస్కూలు బదిలీ చెయ్య వలసిందిగా డి.డి.పి.ఐ.కి ఆర్డరు టైపు చేయించింది. మాకు ఒక కాపీ ఇచ్చింది.

ఇంతకి ఈమె ఎవరు? అని మా ప్రక్కన వారిని అడిగాము. ఆమె ఎడ్యుకేషన్ మినిస్టరు – శ్రీమతి గ్రేస్ తక్కర్ గారని చెప్పారు. దేవునికి స్తోత్రము! తర్వాత కొద్దినెలలలో గుల్బర్గా డివిజన్‌లో అన్ని హైస్కూల్సుకి నోటీసు పంపించబడింది. పర్మనెంటు గ్రాడ్యుయేషన్ టీచర్సు కొరకైన డివిజనల్ లెవల్ రిక్రూట్ మెంట్ కమిటీకి పంపించారు.

బళ్ళారి హైస్కూలులో పనిచేస్తున్న ఆరుగురు టీచర్లు అందుకై అప్లై చేశారు. ఆరుగురికి కాగితాలు పంపించారు. కన్నడ వచ్చిన టీచర్లు మాత్రమే రావాలన్నారు. ఆరుగురు ఆప్లై చేసిన టీచర్లు ఇంటర్వ్యూకి వచ్చారు. ఒకరి తర్వాత ఒకరు అయిదుగురి ఇంటర్వ్యూ జరిగింది. ఆఖరు దానను నేను. నాకు అనుభవము ఉంది కాని భాషలేదు. కన్నడ తెలియదు. నన్ను అడిగిన మొదటి ప్రశ్న – సెయింట్ జోసఫ్ స్కూలు నీవెందుకు వదలాలనుకుంటున్నావు? అని అడిగారు. నా భర్త వేరే చోట పనిచేస్తున్నారు. నాకు చిన్న బిడ్డ ఉన్నది అన్నాను. తర్వాత రాజకీయము, జనరల్ ప్రశ్నలు అడిగారు. నేను అదే స్కూలులో ఉద్యోగం చేస్తున్నాను. కనుక నన్ను ఎవరూ పట్టించుకోలేదు.

నేను స్కూలుకు వచ్చేశాను. కొన్ని రోజుల తర్వాత ఫలితాలు వచ్చాయి. నా పేరే మొదటిగా పలకరించబడింది. దేవునికి స్తోత్రములు చెల్లించాను.

1992లో పదవీ విరమణ చేశాను. కదిరిలోని 'శాంతినికేతన్ స్కూలులో చేరాను. నాలుగయిదు సంవత్సరాలు హైస్కూలు, ఇంటర్ వారికి బోధించాను. విద్యార్థులు మంచి మార్కులు తెచ్చుకున్నారు. ఈ సాక్ష్యము మీతో పంచుకొనుటకు ప్రభువిచ్చిన సమయము కొరకు ఆయనకే వందనములు, స్తుతులు!

# సువార్తలలోని యేసు కథ

విడాకుల సమస్య గురించి పరిసయ్యులతో సంభాషణ ముగించిన వెంటనే పసిపిల్లలను యేసు దగ్గరకు తీసుకొని వచ్చిన సంఘటన గ్రంథములో చూపించబడింది. ఇదేదో కాకతాళీయంగా జరిగినది కాదు. మానవజాతికి దేవుడు ఏర్పాటు చేసిన విధి – వివాహము. దీనిద్వారానే దేవుని లక్ష్యము నెరవేరుతుంది. ఇది ఆయన నిర్మించిన ఉద్దేశ్యమే! నాడు – మీరు ఫలించి అభివృద్ధిపొంది విస్తరించి భూమిని నిండించి దానిని లోబరచుకొనుడి అన్నాడు. వారిని స్త్రీనిగాను పురుషునిగాను సృజించిన నాటినుండే వారు ఫలిస్తున్నారు. అంటే బిడ్డలను కంటున్నారు. పిల్లలకొరకై స్త్రీ పురుషులు చేసే కార్యక్రమము దేవునివలన నిర్ణయింపబడినది కాని, పండు తినుట ద్వారా లోకములోకి రాలేదు. మరణం లేదు. కనుక మానవుల వయస్సు లెక్కించబడలేదు. పండుతినిన తర్వాత ఆదామును – నీ భార్య మాటవిని తినవద్దని నేను నీ కాజ్ఞాపించిన వృక్ష ఫలములు తింటివి గనుక..... అని నేలనుండి నీవు తీయబడితివి, నీవు మన్నే గనుక తిరిగి మన్నై పోదువు అన్నాడు. అప్పుడు మానవుడు పొలములోకి వచ్చిన తర్వాత నేలమన్నై పోయేంతవరకు అతని సంవత్సరములు లెక్కించడం ప్రారంభమయినది.

బిడ్డలను కనుటకు దేవుడు వారికి అమర్చిన అవయవములు దేవుడు వారిని నిర్మించినపుడే అమర్చాడు. బిడ్డలనుకనడం దేవుని బహుమానము కాని, ఆ బహుమానము పొందుటకు వారు దేవుని దృష్టిలో యదార్థముగా జీవించాలి కాని, ఇష్టము ఉన్నంతవరకు కలసివుండి ఇష్టంలేనప్పుడు విడిపోవాలని కాదు. అందుకనే పరిసయ్యులతో – మీ హృదయకాఠిన్యమును బట్టి అతడు (మోషే) మీకు వ్రాసి ఇచ్చెను. కాని సృష్టి ఆదినుండి వారిని పురుషునిగాను స్త్రీనిగాను కలుగజేసెను. ఈ హేతువు చేత పురుషుడు తన తల్లిదండ్రులను విడిచిపెట్టి తన భార్యను హత్తుకొనును. వారిద్దరు ఏకశరీరమై యుందురు గనుక వారిక ఇద్దరుగా ఉండక ఏకశరీరముగా నుందురు. కాబట్టి దేవుడు జతపరచిన వారిని మనుష్యుడు వేరుపరచకూడదు అన్నాడు. ఈ మాటలు ముగియగానే చిన్నబిడ్డలను యేసు దీవెనకొరకు యేసును విశ్వసించినవారు భార్యాభర్తలుగానే ఆయన యొద్దకు వచ్చియుంటారు. వారి హృదయములో మనసులలో దేవుడు వారికిచ్చిన బహుమానమైన బిడ్డలను ఎత్తుకొని వచ్చారు. అది యేసునకు ఎంతో ఆనందము కలుగజేసింది. ఆయనకు పరిసయ్యుల ప్రశ్నలవలన కలిగిన అలసట పోయినది.

అంతేకాక యెషయా ప్రవచనము కూడ యేసు నెరవేర్చుచున్నాడు – గొఱ్ఱెలకాపరి వలె ఆయన మందను మేపును. తన బాహువుతో గొఱ్ఱెపిల్లలను కూర్చి రొమ్మున ఆనించుకొని మోయును. పాలిచ్చువాటిని ఆయన మెల్లగా నడిపించును. యెషయా 40:11

శిష్యులు యేసుకు అలసట లేకుండా ఆయన విశ్రాంతి తీసుకోవాలని చిన్నబిడ్డలను ఆయన దగ్గరకు రాకుండా ఆపారు. కాని యేసు వారిని కోపపడ్డాడు. క్రైస్తవ ప్రపంచములో చిన్నపిల్లల స్థానము ఏమిటో రాబోవు తరాల వారు జ్ఞప్తికి ఉంచుకొని సంఘము చిన్నపిల్లల విషయములో దేవునికి కోపము తెప్పించకూడదని, అంతేకాక ప్రభువు పునరుత్థానుడైన తరువాత పేతురుతో – యోహాను కుమారుడవైన సీమోనూ! వీరికంటే నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడిగాడు. నా గొఱ్ఱెపిల్లలను మేపుము అన్నాడు. కాబట్టి చిన్నపిల్లల విషయములో యేసు యొక్క మనస్తత్వము మనకు అర్థమయేందుకు ప్రభువు సూచనగా చేశాడు.

ఏ క్రైస్తవ సంఘము అయితే చిన్నపిల్లల విషయంలో ఆత్మీయముగా ఎక్కువ శ్రద్ధ తీసుకుంటుందో ఆ సంఘము ముందుకాలములో సర్వ సమృద్ధిలోనికి నడిపించబడుతుంది. చిన్నపిల్లలను ఆశీర్వాదించిన ప్రభువు మనసు ఉల్లాసముగా ఉన్నది. ఆ గ్రామము నుండి ఆయన యెరికో వైపుగా ప్రయాణం సాగించాడు. ఆయన చుట్టూ శిష్యులు వలయంగా ఏర్పడి నడుస్తున్నారు.

ఇంతలో ధనవంతుడైన యవ్వనస్తుడు సుమారు ముప్పయి సంవత్సరములకు దగ్గరలో వయస్సున్నవాడు – అంతేకాక ఇతను అధికారి. ఆయన ప్రభువు వెళ్ళిపోతున్నాడని గ్రహించి పరుగెత్తుకుంటూ వచ్చి – శిష్యుల వలయాన్ని ఛేదించుకొని యేసు ముందుకు సాగకుండా ఆయన యెదుట బాటమీదనే మోకాళ్ళని చేతులు జోడించాడు.

ప్రభువు వెంటనే అతని చెయ్యి పట్టుకొని పైకి లేపాడు. అతను ధనవంతుడు – అధికారి. కాబట్టి అక్కడ వున్న జనానికి అతను ఎవరో తెలిసివుండాలి. అతని ఆవేదన అందరూ చూస్తున్నారు. చాలాకాలంగా అతని హృదయం లోని వ్యధ ఇప్పుడు యేసు పోగొడతాడని అతనికి నమ్మకము ఉన్నది. ఎందుకంటే మొదటిరాత్రివేళ యేసును కలుసుకొనిన నికోదేము కూడా అధికారే! ఆయన మాట్లాడుతూ బోధకుడా! నీవు దేవునియొద్దనుండి వచ్చిన బోధకుడివని **మేమెరుగుదుము** అన్నాడు. మేము అంటే – ఆ అధికారులలో యేసును విశ్వసించినవారు కొందరున్నారు.

ఈ యవ్వనస్తుడైన అధికారి ఎంతోకాలంగా యేసును కలుసుకొని తన హృదయవేదన చెప్పుకొని ఆయన చేయమని చెప్పిన ఏ కార్యమైనా చేసి తను హృదయ నెమ్మది అంటే నిత్యజీవార్ధమైన సంశయము తీర్చుకోవాలని అనుకొన్నాడు. ఈ పల్లెటూరిని యేసు దాటివెళ్ళకముందే పరుగెత్తి వచ్చాడు. యేసు దగ్గరనుండి తన హృదయానికి శాంతినిచ్చే సమాధానము దొరకాలంటే యేసును ఏ విధంగాను మభ్యపెట్టలేమని అతనికి తెలుసు కనుక యేసు ఎదుట మోకరించి సద్భోదకుడా! అని చేతులు జోడించాడు. నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చెయ్యవలెను? అన్నాడు. నిత్యజీవము ఓ మనిషి కష్టపడి సంపాదించు కోవలసినదే! కాబట్టి ఏ రకమైన మంచి కార్యము తను చేస్తే దేవుడు శాశ్వతమైన నిత్యజీవము తనకు అనుగ్రహిస్తాడు అని అతని నమ్మకము. అతను యేసును మంచి బోధకునిగా తనకు సహాయం చెయ్యమన్నాడు. అంతేకాని యేసుని దేవుని కుమారునిగా, రక్షకునిగా గుర్తించలేదు. యేసును అంగీక రించిన వారికి మాత్రమే నిత్యజీవము అని అతను ముందు గుర్తించాలి.

నన్ను నీవు సత్పురుషునిగా ఎందుకు చెబుతున్నావు? దేవుడొక్కడేగాని మరెవరు సత్పురుషుడు కాదు అని అన్నాడు. నామాట విని నన్ను పంపినవానియందు విశ్వాసముంచు వాడు నశింపక నిత్యజీవము గలవాడు అని అతనితో చెబితే అతను అర్ధంచేసుకునే స్థితిలో లేడు. కనుక వ్యభిచరింపవద్దు, నరహత్య చేయవద్దు, దొంగిలవద్దు, అబద్ధసాక్ష్యము పలుక వద్దు, నీ తల్లిదండ్రులను సన్మానింపుము అను ఆజ్ఞలను ఎరుగుదువు కదా? అన్నాడు. అందుకతడు బాల్యమునుండి ఇవన్నియు అనుసరించుచునే ఉంటిని, ఇకను నాకు కొదవయేమి? అన్నాడు సంతోషంగా.

యేసుమాటలు చుట్టు ఉన్న జనము వింటున్నారు. యేసు ఎంతోప్రేమగా ఆ యవ్వనస్తుని చూచాడు. నీవు పరిపూర్ణుడగుటకు నీకు ఒకటి కొదువగా ఉన్నది. నీవు వెళ్ళి నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము – పరలోక మందు నీకు ధనము కలుగును. నీవు వచ్చి నన్ను వెంబడించుము అన్నాడు. అతను చాలా ఎక్కువ చందా వేస్తాడని, బీదలకు దానధర్మాలు చేస్తుంటాడని అందరికి తెలుసు. అయితే యేసుచెప్పిన విషయం ఎవరూ ఊహించనిది. ఇంతకు ముందు ఎవరూ చెప్పనిది. తన ఆస్థిలో కొంత తన జీవితమునకు దాచుకొని ఇవ్వమని చెబుతారు. కాని ఆస్థి అంతా అమ్మివేసి బీదలకు పంచి, తనకంటూ ఏమీ లేనివాడుగా యేసు దగ్గరకు వారే రావాలి. తన కొరకు పరలోకరాజ్యములో ధనము సిద్ధపరచబడుతుంది. దానిని అవసరాలకు దేవుడే మనకివ్వాలి. అంటే తను ఇంతవరకు చేసిన దానధర్మాలు, మంచితనము ఏదీకూడా తను నిత్యజీవము పొందుటకు పనిచేయవు.

యేసుదృష్టిలో ధనవంతుడు ఇంతకుముందు చేసిన దానధర్మాలు అన్ని బీదలను ప్రేమించి కాదుగాని, తను మంచివాడైయుండి నిత్యజీవము పొందాలనే తపనతో చేసినవి. ఆ ధనవంతుడు తన ఆస్థినయినా వదులుకోవాలి లేదా యేసునయినా వదులుకోవాలి. ధనవంతుడు తనకు, యేసుకు మధ్యలో మహా అఘాతము ఉన్నదని గ్రహించాడు. నిత్యజీవమునకు రబ్బీ అయిన యేసు చెప్పిన పరిష్కారము తను వెంబడించలేనని తలవాల్చుకున్నాడు. అతని హృదయం భరించరాని వేదనతో ఉన్నది. దుఃఖముతో, కోపముతో కూడినది. నిత్యజీవమునకై యేసు చెప్పినది తను తీర్చలేనిది. వెనుదిరిగి వెళ్ళిపోయాడు.

యేసు వెళ్ళిపోతున్న యవ్వనస్తుని చూసి నిట్టూర్చాడు. యేసుకు తెలుసు – తనతో ఒక్కసారి మాట్లాడినవారు తనలోని శక్తినిపొంది యేసుకొరకు జీవిస్తారు. యేసు – జీవము, ఆయన మాటలు – జీవము. ఈ లోకపు మాటలు ఒక హృదయములో పడితే సరియైన సమయములో ఫలిస్తాయని.

# North East West South వార్తలు

## మాల్దీవుల కొరకు ప్రార్థించండి

**మాల్దీవులు :** షిజో అనే భారతీయ టీచరును గతనెలలో అరెస్టు చేసినట్లు తెలియవచ్చింది. కథనం ప్రకారం షిజో కంప్యూటర్‌లో క్రైస్తవ భక్తి గీతాలు ఉన్నందుకు అరెస్టు చేశారు. షిజోను విడుదల చేసి, భారతదేశానికి పంపించినట్లు తెలియవచ్చింది.

మాల్దీవులు – ప్రసిద్ధ పర్యాటక ప్రాంతం. అయినప్పటికి నివాసితులందరు ముస్లిములై ఉండాలి. ఎవరైనా పర్యాటకులు క్రైస్తవ మెటీరియల్ కలిగివుంటే వారిని వెంటనే వెనక్కి పంపిస్తారని ఓపెన్ డోర్స్ అనే సంస్థ తెలియజేసింది. క్రైస్తవ సంబంధమైన మెటీరియల్ కలిగివుండడం మాల్దీవుల చట్టవ్యతిరేకమని తెలియజేసింది.

## బహిరంగ చర్చ్ లేని దేశం ఆఫ్ఘనిస్తాన్

**ఆఫ్ఘనిస్తాన్ :** గత పది సంవత్సరాలనుండి ఆఫ్ఘనిస్తాన్‌లో మత స్వాతంత్ర్యం దారుణంగా క్షీణించడం మొదలుపెట్టింది. క్రైస్తవ పాఠశాలలు పూర్తిగా మూయబడ్డాయి. క్రైస్తవ సామాజిక కార్యక్రమాలు కూడా నిషేధించబడ్డాయి. క్రైస్తవులుగా మారిన వారిని గురిగా చేసుకుని దాడులు పెంచబడ్డాయి. మార్చి 2010న ఆఖరి పబ్లిక్ క్రిస్టియన్ చర్చ్ కూల్చబడింది.

## క్రీస్తు పూర్వం, క్రీస్తు శకం మార్చే యోచనలో ఆస్ట్రేలియా

**ఆస్ట్రేలియా :** ఆస్ట్రేలియాలోని పాఠ్య పుస్తకాలలో బి.సి. (బిఫోర్ క్రైస్ట్, క్రీస్తు పూర్వం), ఎ.డి. (అన్నో డొమిని, క్రీస్తు శకం) అనే పదాలను మార్పు చేసి, బి.సి.కి బదులుగా బి.సి.ఇ. (బిఫోర్ కామన్ ఎరా) లేక బి.పి. (బిఫోర్ ప్రెజెంట్) ఎ.డి.కి బదులుగా సి.ఇ. (కామన్ ఎరా) గా ప్రింటు చెయ్యాలని, తీర్మానించింది. దీనిని ఆస్ట్రేలియాలోని క్రైస్తవ నాయకులు వ్యతిరేకిస్తున్నారు.

## వంద సంవత్సరాల సిలువలు తొలగింపు

**కాలిఫోర్నియా :** వంద సంవత్సరాల క్రితం ఏర్పాటుచేయబడిన మూడు సిలువలను కాలిఫోర్నియా రాష్ట్ర అధికారులు తొలగించారు. తోలగింపుకు సంబంధించిన కారణాల వివరాలు తెలియరాలేదు.

## క్రైస్తవ ఆలోచనలను అడ్డుకుంటున్న సోషల్ సైట్స్

ఫేస్‌బుక్, గూగుల్, ఆపిల్ మరియు మై స్పేస్ వంటి సోషల్ నెట్‌వర్క్ సైట్స్ క్రైస్తవ ఆలోచనలను అడ్డుకునే విధముగా నియమనిబంధనలను రూపొందించుచున్నట్లు అమెరికాకు చెందిన ఎన్.ఆర్.బి. (నేషనల్ రెలీజియస్ బ్రాడ్‌కాస్టర్స్) తెలియజేసింది.